మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక


22.2.2025
శనివారం Saturday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 311
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar

## సౌతాఫ్రికా చేతిలో ఆఫ్ఘనిస్తాన్ చిత్తు



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



తాజ్ బంజారాకు
## జీహెచ్ఎంసీ షాక్
పన్ను కట్టనందుకు హోటల్ సీజ్

02



ఆ రెండు కేసులూ
## కొట్టేయండి
- హైకోర్టులో కేటీఆర్ పిటిషన్లు
- సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని వ్యాఖ్యల

02



## కృష్ణా బోర్డు భేటీ వాయిదా
- ఏపీ హాజరకాక పోవడంతో నిర్ణయం

02



# ఎవరి పాలన ఏందో తేలుద్దాం

### కేసీఆర్, కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ బహిరంగ సవాల్

### కేసీఆర్, మోడీ, నా పాలనపై చర్చ చేద్దాం

పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టిన ఘనత కేసీఆర్‌దే
ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తా
మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు ఖరారు
నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



నారాయణపేట, జనతా న్యూస్: పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. 11 ఏళ్లు మోదీ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ద మా అని సీఎం రేంవత్ అన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి చర్చకు రావాలని అన్నారు. చర్చ లో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తానని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజాపాలన బాగలేదని ప్రతిపక్షాలు విమర్శ లు చేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యగాలు ఇచ్చాం.

మిగతా 2 లో

## రేణుకా తల్లికి పట్టువస్త్రాలు సమర్పణ



వికారాబాద్, జనతా న్యూస్: వికారాబాద్ జిల్లా పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకుని ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, అధికారులు రేవంత్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# పదేండ్ల పాటు దోచుకున్నారు

### కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారుమయం చేసుకున్నారు



03

మార్పు హామీలిచ్చిన రేవంత్.. అమలులో విఫలం అయ్యారు
ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం తథ్యం
కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయం తథ్యమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బిజెపి మాత్రమే తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. పదేళ్లపాటు తెలంగాణను కేసీఆర్ కుటుంబమంతా దోచుకుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చేసుకున్నా రని విమర్శించారు.



# రుణమాఫీ పై అందమైన కట్టుకథలు

గాంధీభవన్ దాకా వచ్చిన వారు మీ ఇంటికీ వస్తారు
ఆరు గ్యారెంటీలపై ఇంకా నిలదీస్తారు
మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

03



## యాదగిరిగుట్ట మహా కుంభాభిషేకానికి కేసీఆర్‌కు ఆహ్వానం

కేసీఆర్ ప్రభుత్వం పునర్నిర్మాణం సందర్భంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన స్వర్ణ విమాన గోపురానికి.. ఈనెల 23 న మహా కుంభాభిషేకం కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, యాదగిరి గుట్ట పునర్నిర్మాణ కర్త, బి. ఆర్. ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ను ఆలయ అధికారులు, పూజారులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కాండూరు వెంకటాచార్యులు, డీఈఓ దోర్బల భాస్కర్, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహ మూర్తి, కిరణ్ కుమారాచార్యులు, ప్రోటోకాల్ సూపరిండెంట్ రాజన్ బాబు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో
# ఎరువులు

- యూరియాకు కేంద్రానికి తుమ్మల లేఖ
- అధికారులతో పరిస్థితులపై సమీక్ష



రైతులకు ఎరువుల కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏయే ఎరువుల ఎంతెత అవసరమో స్టాక్ పెట్టుకోవాలన్నారు. అరాష్ట్రంలో ఎరువుల సరఫరా లభ్యతపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



02

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ
# ఏకగ్రీవం
పోటీ నుంచి తప్పుకున్న బీఆర్ఎస్




02

పదేళ్లుగా కృష్ణా వాటాలపై
## బీఆర్ఎస్ మౌనం
ఇప్పుడేమో విమర్శలు చేస్తున్న నేతలు
మండిపడ్డ ఎమ్మెల్సీ కోదండరామ్

పెళ్లి మండపంలో
## విషాదం
గుండెపోటుతో పెళ్లి కూతురు తండ్రి మరణం



.. వివరాలు 4లో



## తాజ్ బంజారాకు జీహెచ్ఎంసీ షాక్

### పన్ను కట్టనందుకు హోటల్ సీజ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన తాజ్ బంజారా హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారుల షాక్ ఇచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్ తాజ్ బంజారా హోటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో ఈ మేరకు అధికారులు సీజ్ చేశారు. పన్ను చెల్లించాలని పలు మార్లు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. మొత్తం రూ. కోటి 47 లక్షల టాక్స్ పెండింగ్ ఉందని, పన్ను చెల్లించాలని.. జీహెచ్ఎంసీ అధికారులు 5 సార్లు నోటీసులు ఇచ్చిన హోటల్ యాజమాన్యం స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా హోటల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీకి పన్ను బకాయిలు చెల్లించలేదు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా హోటల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పరిస్థితి గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన.. నిత్యం బిజీగా ఉండే తాజ్ బంజారా హోటల్‌కు సెలబ్రెటీలు ఎక్కువగా వస్తుంటారు. క్రికెటర్లు ఎప్పుడు వచ్చినా ఈ హోటల్‌లో బస చేస్తుంటారు. అలాగే దేశంలోని కీలక రాజకీయ నేతలు హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడే స్టే చేస్తారు. పార్టీ సమావేశాలకు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది ఈ హోటల్ వైపు మొగ్గుచూపుతారు. అటాంటి హోటల్ సీజ్ కావడం గమనార్హం..

## కృష్ణా యాజమాన్య బోర్డు భేటీ వాయిదా

### ఏపీ హాజరకాక పోవడంతో నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం వాయిదా పడింది. సమావేశానికి తాము హాజరుకాలేమని, వాయిదా వేయాలని ఏపీ అధికారులు కోరారు. దీంతో సమావేశాన్ని సోమవారానికి బోర్డు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మే-రకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించామని అధికారులు వెల్లడించారు. కాగా, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నదని, వెంటనే అడ్డుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఏపీ విజ్ఞప్తితో సమావేశం వాయిదాపడింది. అయితే కృష్ణా, గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించిన విషయం తెలసిందే. 666 టీఎంసీలకు ఏపీ ఇప్పటికే 657 టీఎంసీలను వినియోగించుకున్నదని, తెలంగాణకు 343 టీఎంసీలకు 220 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవడం ప్రభుత్వ అసమర్ధతేనని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి రైతుల పంటలు కాపాడలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదలను వెంటనే బంద్ చేయించాలని డిమాండ్ చేశారు.

## ఆ రెండు కేసులూ కొట్టేయండి

### హైకోర్టులో కేటీఆర్ రెండు వేర్వేరు పిటిషన్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్‌లో కేసు నమోదైంది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.

## భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి

### హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రాజలింగ మూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

# ఎవరి పాలన ఏందో తేలుద్దాం

మొదటి పేజీ తరువాయి



21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. పరిశ్రమలు ,ప్రాజెక్టులు రాకుండా బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటుందని మండిపడ్డారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట్ ,కొడంగల్ ప్రాజెక్టులను మొదలు పెట్టానన్నారు. కేసీఆర్ గట్టిగా కొడతానంటున్నావ్.. గట్టిగా కొట్టడానికి అది ఫుల్లా.. ఆఫా.. కొట్టాలనుకుంటే ముందుగా మీ బిడ్డను ,కొడుకును, అల్లుడిని కొట్టు..మమ్మల్ని కొడితే మా కార్యకర్తలు ఊరుకుంటారా? ఇచ్చిన హామీలను ఐదేళ్లలో పూర్తి చేసే బాద్యత నాదే అని రేవంత్ అన్నారు. గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు. గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నె÷-టటెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు. ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాదని సీఎం అన్నారు. ఇకపోతే ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని వేల కోట్లయినా ఖర్చుచేస్తానన్నారు. నారాయణపేట జిల్లా అప్పకపల్లిలో మెడికల్ కాలేజీ,హాస్టల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్..70 ఏండ్ల తర్వాత మహబూబ్ నగర్ జిల్లా వ్యక్తికి సీఎం అయ్యే అవకాశం వచ్చింది. జిల్లా అభివృద్ధి కోసం చేయాల్సినవన్నీ చేస్తా. నా జిల్లా అభివృద్ధి కోసం ఎన్నివేల కోట్ల రూపాయలైనా రాష్ట్ర బడ్జెట్లో కేటాయిస్తా. జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా. ఇక్కడి మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టాలని అదేశిస్తున్నా అని రేవంత్ అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే పర్ణికా ఓ డాక్టర్ కావడం ఇక్కడి మెడికోల అదృష్టమన్నారు. మీ అవసరాలు ఎంఎల్ఏ కు చెప్పాల్సిన పనిలేదు. ఈ వృత్తి ఓ మానవీయ దృక్పథంతో చేయాల్సిన పని. ఇక్కడి పారా మెడికల్ సిబ్బందికి మిడిల్ ఈస్ట్ లో చాలా డిమాండ్ ఉంది.. ఆ కోవలో కూడా మీ ఉపాధి కోసం ప్రభుత్వం ఆలోచిస్తుంది. జీవితంలో ఇది చాలా కీలక సమయం.. మీరు వినియోగించుకుని చదువులో రాణించాలి. పేదలకు నాణ్యమైన వైద్యంఅందాలి. మారుమూల గ్రామాల పేదలకు వైద్య సేవలందిస్తాం. టీచింగ్,నాన్ టీచింగ్ స్టాఫ్ లేకుండా గొప్ప డాక్టర్లు కాలేరు. అద్దాల మేడలు అభివృద్ధి కాదని అంబేద్కర్ చెప్పారు. మెడికల్ కాలేజీలకు నిధుల లోటు రానివ్వం అని రేవంత్ అన్నారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు

### అధికారులతో పరిస్థితులపై తుమ్మల సమీక్ష



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** రైతులకు ఎరువుల కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏయే ఎరువుల ఎంతెత అవసరమో స్టాక్ పెట్టుకోవాలన్నారు. అరాష్ట్రంలో ఎరువుల సరఫరా లభ్యతపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ సంచాలకులు మాట్లాడుతు, గత 5 సంవత్సరాల్లో అత్యధికంగా 2022-23 యాసంగిలో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం ఉన్నదని, దానిని ప్రామాణికంగా తీసుకొని, అంతకంటే ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచేటట్టు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 1 నుండి ఇప్పటిదాకా కేంద్రం నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా ప్రణాళికలు ఇవ్వగా, కేవలము 6.73 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కాబడినదని, ఇదే విషయాన్ని సీజన్ ఆరంభములో కూడా కేంద్రం ధృష్టికి తీసుకువెళ్లగా, మన రాష్ట్ర అవసరాలను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేసే బాధ్యత తమదని కేంద్రం నుండి భరోసా వచ్చినప్పటికి కేవలం ఫిబ్రవరి మాసములోనే 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా రావడం జరిగిందని తెలిపారు. అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్1 న ప్రారంభనిల్వలు 3.08 లక్షల మెట్రిక్ టన్నులను జాగ్రత్తగా సరఫరా చేస్తు, రాష్ట్రం మొత్తం మీద రైతుల అవసరాలకు తగ్గట్టు ఇప్పటిదాకా సరఫరా చేయడం జరిగిందని, ఇకముందు కూడా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.30 లక్షల మెట్రిక్ టన్నులను అవసరాల మేరకు ఆయా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో మన రాష్టానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే ఇతర కంపెనీల ద్వారా సరఫరా చేయుటకు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రిని లేఖ ద్వారా తిరిగి కోరడం జరిగింది. మన రాష్టానికి కేటాయించిన ఎరువులను సరఫరా చేయుటకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి అవసరం మేరకే కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రైతులను కోరడం జరిగింది. సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు శ్రీ గోపి , కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

## పోటీ నుంచి తప్పుకున్న బీఆర్ఎస్

### జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. బలం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎఐఎంఐ నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 15 మంది స్టాండింగ్ కమిటీలో ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7 సభ్యులు ఉండనున్నారు.గతంలో బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేయగా....అధిష్టానం ఆదేశంతో నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. గత పదేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అవుతూ వస్తున్నాయి. అలాగే గత పదేళ్లలో తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించు కున్నారు. ఃూగా.. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ప్రతీ ఏడాది ఎన్నుకోవడం జరుగుతుంది. జీహెచ్ఎంసీలో పాలనాపరంగా, కొత్త ప్రాజెక్టలకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నా మేయర్, డిప్యూటీ మేయర్ అనంతరం ఈ 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంతో కీలకం. గడిచిన పదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగలేదు. ప్రతీసారి కూడా ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతూనే ఉంది. ఈ సారి కూడా సంఖ్యాబలం లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు తప్పుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.

## ఇప్పటికే వాటాకు మించి నీటిని వినియోగించిన ఏపీ

### ఇకముందు వాడకుండా నిలువరించండి

### కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. శుక్రవారం తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ అధికారులు.. ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్ర మంత్రి నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయడం లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## పదేళ్లుగా కృష్ణా వాటాలపై బీఆర్ఎస్ మౌనం

### ఇప్పడేమో విమర్శలు చేస్తున్న నేతలు

### మండిపడ్డ ఎమ్మెల్సీ కోదండరామ్



**హైదరాబాద్,ఫిబ్రవరి 21:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేందప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం ఫైర్ అయ్యారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. నాంపల్లిలోని ఆఫీసులో ఆయన మీడియతో మాట్లాడిన ఆయన.. 'తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ల పంపకం ఒకటి. కృష్ణాజలాల నీటి వివాదంపై గత పదేండ్లు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదంగా ఉంది.. . గత పదేండ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడింది' అని మండిపడ్డారు.తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం తెలిపారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీగా అశోక్ కు, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో గోపాల్ రెడ్డికి మద్దతిస్తామన్నారు.

# పదేండ్ల పాటు దోచుకున్నారు



**మెదక్, ఫిబ్రవరి 21:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయం తథ్యమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బిజెపి మాత్రమే తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. పదేళ్లపాటు తెలంగాణను కేసీఆర్ కుటుంబమంతా దోచుకుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మార్పు తెస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినా,ఆచరణలో అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి.. ప్రకటనలు ఫస్ట్ పేజీల్లో ఉన్నాయి.. పనులు మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రుల్లో సఖ్యత లేదని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు రానుందని జోస్యం చెప్పారు. శుక్రవారం మెదక్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మాత్రమే అన్ని స్థానాలకు పోటీచేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్‌కు ఎమ్మెల్సీ ఎన్నికలు దిశానిర్దేశం చేసేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. రేవంత్ ఇచ్చిన ఏ ఒక్క హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని.. మిగిలిన యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రేవంత్ ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని మండిపడ్డారు. ప్రతి దళిత కుటుంబానికి రూ 12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలపై రేవంత్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పోయి రేవంత్ వచ్చిన కూడా ప్రజల బతుకులు మారడం లేదని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్నచోట అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అవినీతికి పెద్దపీట వేశారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో మంచి పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో మంచి పాలన రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# రుణమాఫీపై అందమైన కట్టుకథలు

- గాంధీభవన్ దాకా వచ్చిన వారు మీ ఇంటికీ వస్తారు
- ఆరు గ్యారెంటీలపై ఇంకా నిలదీస్తారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రజలు నిలదీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు. అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరి గారికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# పవన్ పుణ్యస్నానాల ఫోటోల మార్ఫింగ్‌పై విచారణ

**నరసరావుపేట, ఫిబ్రవరి 21:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోల మార్ఫింగ్‌పై జనసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కుంభమేళాలో పవన్ పవిత్ర స్నానం చేశారు. దానికి సంబంధించిన ఫొటోలను కొందరు మార్ఫింగ్ చేసి 'జగనన్న సైన్యం' పేరిట ఉన్న సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. పవన్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అభ్యంతరంగా పెడుతున్నారంటూ జనసేన కార్యకర్తలు నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



# ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్

**రాహుల్‌కు గట్టిగా కౌంటర్ ఇచ్చిన మాయావతి**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఎస్పీ నేత మాయావతి గట్టి కౌంటర్ ఇచ్చింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ వ్యవహరించిందని, దాని వల్లే ఢిల్లీలో బీజేపీ గెలిచినట్లు మాయావతి పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో.. ఇండియా కూటమికి బీఎస్పీ మద్దతు ఇవ్వలేదని, ఇది నిరుత్సాహానికి గురిచేసినట్లు ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బెహన్‌జీ తమతో కలిసి పనిచేస్తే, బీజేపీ నెగ్గేది కాదన్నారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఇవాళ మాయావతి కౌంటర్ ఇచ్చారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆమె పోస్టు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ పని చేసిందన్న విషయం అందరికీ తెలుసు అని, దాని వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరిస్థితిలో ఉందని, కనీసం ఆ పార్టీ అభ్యర్థులకు చాలా చోట్ల డిపాజిట్ కూడా దక్కలేదని ఆమె తెలిపారు. ఇతరుల పట్ల వేలు పెట్టి చూపే ముందు, తన స్వంత వ్యవహారాల గురించి సమీక్ష చేసుకోవాలని కాంగ్రెస్ నేతకు మాయావతి సూచన చేశారు.ఢిల్లీలో ఏర్పడిన బీజేపీ సర్కారుకు ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడం పెను సవాల్‌గా మారనున్నట్లు మాయావతి ఆరోపించారు.

# హామీలు ప్రశ్నిస్తే.. హరీష్‌పై కేసులు

**బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** రేవంత్‌రెడ్డి హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ నేతలు ప్రజలపై మత్తు మందు చల్లారు. ఏడో గ్యారంటీగా ప్రజా పాలన అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రతీకార పాలన అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్ రెడ్డి కక్ష గట్టి ఓ నేరస్తుడు చక్రధర్‌తో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారు. అధికారులను పావులుగా వాడుకుని హరీశ్‌రావును ఎంతగా వేధించినా ప్రజల పక్షానే ఉంటారు. హరీశ్‌రావు ఏడు సార్లు సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొవిడ్ సమయంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారు. రేవంత్ రెడ్డిలాగా హరీశ్‌రావు ఓటుకు నోటు కేసులో పాలుపంచుకోలేదని అన్నారు. ఏదైనా చేసి దేంట్లోనైనా హరీశ్‌రావును ఇరికించాలని రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డిని హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీష్ రావుపై కక్ష గట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పంజాగుట్ట కేసులో హరీశ్‌రావు దగ్గర కేవలం మూడు నెలలు పనిచేసిన వంశీని డీసీపీ చేసిన టార్చర్ అంతా ఇంతా కాదు. హరీశ్ రావు పేరు చెప్పాలని లేదంటే చంపేస్తామని డీసీపీ విజయ్ కుమార్ బెదిరించారు. లైంగిక దాడి వంటి తీవ్ర నేరారోపణలు చక్రధర్‌పై ఉన్నాయి. 1900 మందిని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసు చక్రధర్‌పై ఉంది. కిడ్నాప్ కేసు కూడా చక్రధర్‌పై ఉంది. చక్రధర్ రేవంత్ ప్రోద్బలంతోనే హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు పెట్టారు. మొదట హైకోర్టులో రిట్ వేసి చక్రధర్ విత్ డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత పంజాగుట్టలో ఫిర్యాదు చేయగానే కొన్ని గంటల్లోనే హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి హరీశ్‌రావు, ఆయన అనుచరగణంపై పోలీసులు కక్ష గట్టి వ్యవహరిస్తున్నారు అని ఆర్ఎస్పీ తెలిపారు.


# పెళ్లి మండపంలో విషాదం

**గుండెపోటుతో పెళ్లి కూతురు తండ్రి మరణం**

**కామారెడ్డి, ఫిబ్రవరి 21 :** కాళ్లు కడిగి బిడ్డ కన్యాదానం చేయాల్సిన తండ్రి..అప్పటివరకు హుషారుగా పెండ్లి పనుల్లో మునిగి తేలాడు..బంధువులను ఆహ్వానించారు. కళ్యాణ మండప మంతా కలియ తిరిగి పెళ్లి పనులు చూసుకున్నాడు. అయితే ఇంతలోనే గుండెపోటు.. అప్పటివరకు హుషారుగా తిరిగిన వ్యక్తి కుప్ప కూలాడు. కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కన్న కూతురు పెండ్లి జరుగుతుండగా.. పెండ్లి మండపంలోనే గుండెపోటుతో కుప్పకూలిపోయాడు ఓతండ్రి. ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పెండ్లి ఇంట్లో విషాదం నెలకొంది. భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లికి చెందిన కుడిక్యాల బాలచంద్రం (54) గుండెపోటుతో మృతిచెందారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న బాలచంద్రం..శుక్రవారం (ఫిబ్రవరి 21) న తన పెద్ద బిడ్డ మహాలక్ష్మి పెండ్లి స్థానిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.. కుటుంభసభ్యులు, బంధువులు అందరూ పెండ్లి మండపం చేరుకున్నారు. పెళ్లి తంతు మొదలైంది. తాళికట్టే కొద్ది సమయానికి ముందు బాలచంద్రం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్సకోసం బాలచంద్రాన్ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు కుటుంబసభ్యులు. బాలచంద్రానికి సీపీఆర్ చేసి పరీక్షించారు డాక్టర్లు.. అప్పటికే గుండెపోటుతో చనిపోయినట్లు నిర్ధారించారు.




# అదృశ్యమైన నలుగురు విద్యార్థుల ఆచూకీ లభ్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** తప్పిపోయిన అంబర్‌పేట్ ప్రేమ్‌నగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఆచూకీ దొరికింది. ఈ నలుగురు బుధవారం సాయంత్రం అదృశ్యమైన సంగతి తెలిసిందే. దాదాపు 24 గంటల తర్వాత ఆ పిల్లల ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నలుగురు విద్యార్థులు యాదగిరిగుట్టలోని తమ బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లలను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు అంబర్‌పేట్ పోలీసులు యాదగిరిగుట్టకు వెళ్లారు. ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎండి అజమత్ అలీ(13), కొండ్‌పేట తేజ్‌నాథ్ రెడ్డి(13), నితీష్ చౌదరి(13), కోరే హర్ష వర్ధన్(13) నలుగురు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. నలుగురు కలిసి బుధవారం నుంచి కన్పించకుండా పోయారు. వెంటనే అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వీరరాఘవరెడ్డికి ముగిసిన పోలీస్ కస్టడీ

**రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** చిలుకూరు దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. మూడు రోజులపాటు కస్టడీలో వీర రాఘవరెడ్డిని పోలీసులు విచారించారు. కస్టడీ ముగియడంతో రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచి ఆ తరువాత వీర రాఘవరెడ్డిని చంచల్‌గూడా జైలుకు తరలించనున్నారు. వీర రాఘవరెడ్డి తెలుగు రాష్ట్రాల్లోని ఆరు ప్రధాన ఆలయాలకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. పలుచోట్ల రామరాజ్య స్థాపన కోసం ఫండ్స్ వసూలు చేసినట్టు విచారణలో బయటపడింది. వీర రాఘవరెడ్డికి సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ కోసం బ్యాంక్‌కు మొయినాబాద్ పోలీసులు లేఖ రాశారు. ఎప్పటి నుంచి విరాళాలు సేకరించారనే దానిపై వివరాలు రాబట్టారు పోలీసులు. ప్రస్తుతం వీర రాఘవరెడ్డి బ్యాంక్ అకౌంట్‌లో 20,000 మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. ఈ కేసులో మొత్తం 20 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మరో నలుగురు పరారీలో ఉండగా... వారి కోసం మొయినాబాద్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.మూడు రోజుల పాటు వీరరాఘవరెడ్డిని పోలీసులు విచారించిన సమయంలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రామరాజ్య స్థాపన కోసం ఫండ్స్ ఇవ్వాలంటూ పలు ప్రాంతాల్లో ఒత్తిళ్లకు గురిచేసినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లను వీరరాఘవరెడ్డి ముందు పెట్టి మరీ పోలీసులు విచారించారు. ఏపీ, తెలంగాణలో ఏయే ప్రాంతాల్లో డబ్బులు వసూలు చేశారనే అంశానికి సంబంధించి ఆరా తీశారు. ఎప్పటి నుంచి విరాళాలు సేకరించారు అనే దానిపై కూడా కాప్స్ విచారించారు. అతడి బ్యాంకులో కేవలం 20 వేలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు... అరెస్ట్ కాక ముందే నగదు మొత్తాన్ని డ్రా చేసినట్లు అనుమానిస్తున్నారు. వీరరాఘవరెడ్డి ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ఏపీ, తెలంగాణలో చాలా మందిని ఆకర్షించినట్లు తెలుస్తోంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కూడా రామరాజ్యం పేరుతో వారందరికీ పదువులు ఇచ్చి రిక్రూట్ చేయాలని ఆదేశాలిచ్చి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే చిలుకూరు బాలాజీ ఆలయ అర్చుకుడిపై కూడా దాడి చేసినట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లోకి మరో 15మంది కార్పోరేటర్లు

**బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** త్వరలో 15మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరబోతున్నారని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన కేసీఆర్ మీటింగ్‌కి కార్పొరేటర్లను అనుమతించకపోవడంతో నారాజ్ లో ఉన్నారు..త్వరలోనే వీళ్లు కాంగ్రెస్ లో జాయిన్ అవుతారని చెప్పారు.గ్రేటర్ లోని 15 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు మాతో టచ్‌లో ఉన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో జాయిన్ అవుతారు. గత తొమ్మిదేళ్లుగా స్టాండింగ్ కమిటీలో ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ నుంచి ఈ సారి ఏడుగురు సభ్యులు ఉండనున్నారు. కాంగ్రెస్ ను ఎదుర్కొనే దమ్ము లేక బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంది. వచ్చే బల్దియా ఎన్నికల్లో నగర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా ఉండబోతుంది అని బాబా ఫసియుద్దీన్ అన్నారు. బీఆర్ఎస్ కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం అయిన సంగతి తెలిసిందే. స్టాండింగ్ కమిటీలో ఏడుగురు కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఎంఐఎంకు చెందిన ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు.



# నేతల విద్యుత్ పాపాలు!

మసిపూసి మారేడుకాయ చందంగా ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ తయారయ్యింది. పట్టణం, గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు, సామాన్య ప్రజానీకం నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అప్పుడే సమస్యలు తీరుతాయి. గత కెసిఆర్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ పేరుతో ఊదరొగట్టింది. అప్పులు చేసి విద్యుత రంగాన్ని కుప్ప చేసిన వారు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. నిజానికి విద్యుత్ బిల్లులు, విద్యుత్ కోతలు ముందునుంచీ తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివిధ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. గతంలో ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోలేదు. లోపాలు బయటకు రాకుండా... లోపాల వార్తలను ప్రచురించ కుండా కట్టడి చేయించింది. ఇప్పుడేమో గతంలో అధికారంలో ఉన్న పార్టీ గగ్గోలు పెడుతున్నది. విద్యుత్ అందక ఆందోళనలు చేసిన రైతులు అప్పుడూ ఉన్నారు.. ఇప్పుడు కూడా ఉన్నారు. ఇప్పుడు అవే వార్తలను బలంగా ప్రచారం చేస్తున్న తీరు గత పాలకుల దుర్నీతిని తెలియ చేస్తోంది. తెలంగాణలో బెటర్‌మెంట్ ఛార్జీలతో షాక్‌లు ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. ఇక ఎపిలో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడంతో పాటు..విద్యుత్ కోతలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.. ఛార్జీల పెంపు ఇప్పటికే తడిసి మోపెడు చేశారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పినా నష్టాలను తట్టుకోలేని విధంగా తయారు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. వినియోగదారులకు దిమ్మతిరిగేల బిల్లులు వస్తున్నాయి. ఒక్కసారిగా వేల రూపాయల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. కోలుకోలేని విధంగా విద్యుత్ చార్జీలు అప్పుడే పెంచేసారు.. విద్యుత్ వినియోగంలో పెరిగిన లోడ్‌కు సంబంధించి డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌లు వసూలు చేయడం వంటివన్నీ చేసేశారు. దీనిని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సవరించాల్సి ఉంది. కిలోవాట్ లోడ్ జీఎస్‌టీతో కలుపుకుని సుమారు రూ.1500 డెవలప్‌మెంట్ చార్జీలు వడ్డించినట్లు నాటి విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. బాయిలకాడ మీటర్లు పెట్టమని చెబుతూ వచ్చిన కెసిఆర్..ఇలా గృహ వినియోగ దారులపై ఎడాపెడా ఛార్జీలు వేసి ముక్కు పిండి వసూలు చేయించారు. ఘనత వహించిన పాలకుల కాలంలో వందల్లో వచ్చే బిల్లులు వేల రూపాయల్లో వచ్చాయి. వివిధ ఛార్జీల పేరుతో అదనపు బాదుడు సామాన్య, మధ్య తరగతి ప్రజలను షాక్‌కు గురిచేసాయి. వీటిని సవరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎపిలో కూడా జగన్ హయాంలో విద్యుత్ చార్జీల భారం మోపారు. వాటిని కూడా అధికారంలోకి వచ్చిన టిడిపి సవరించడం లేదు. ఇళ్లలో ప్రతినెల రూ.200 నుంచి రూ.500లోపు విద్యుత్ బిల్లులు వస్తుండేవి. డెవలప్‌మెంట్ చార్జీలు ఒక్కసారి మాత్రమే వస్తాయని అవి తప్పనిసరిగా కట్టాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ భారం ఇప్పటికీ పడుతూనే ఉంది. ఇక ఎపిలో పరిస్థితి మరోలా ఉంది. పల్లెల్లో ఎప్పుడంటే అప్పుడు విద్యుత్ కట్ అవుతోంది. 9గంటల వ్యవసాయ విద్యుత్ అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ కోసం రాత్రిళ్లు రైతులు పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. లోడ్ పెరగడమే కారణం అంటున్న అధికారులు జిల్లాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ... ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చేవారు లేకపోవడం తో విద్యుత్ మోటార్ల వద్ద రైతులకు కాలం గడుపుతున్నారు. వేసవి ప్రారంభం కాకుండానే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కాలం కావడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న పరిశ్రమలకూ విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో వరిసాగుకు నీరు అందటం లేదు. రాత్రిపూట ఫీడర్లు, సబ్‌స్టేషన్ల వారీగా కరెంటు ఇవ్వడంతో రైతులు వంతుల వారీగా రాత్రిపూటే పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో అనధికార విద్యుత్ కోతలను అమలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిన సందర్భాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు సాయంత్రం, రాత్రి సమయాల్లో గంటనుంచి రెండుగంటల పాటు అనధికార కోతలు విధిస్తున్నారు. విద్యుత్ లోడ్ పెరిగిన సమయంలో అందుకు అనుగుణంగా డివిజన్ల వారీగా కోతలు విధిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ కోతలు మరింత పెరిగే అవకాశముందని అధికార వర్గాల సమాచారం. వ్యవసాయ సర్వీసులకూ గంటనుంచి రెండు గంటలపాటు అనధికార కోతలు అమలు చేస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు పగటిపూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటం లేదని చెబుతున్నప్పటికీ చిన్నతరహా పరిశ్రమలకు కోతల బెడద తప్పటం లేదు. దీనితో రైతులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. రబీలో మొక్కజొన్న, జొన్న పంటలూ అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో 5గంటలకే కుదిస్తే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో 5 గంటల నుంచి 8 గంటలపాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. వ్యవసాయపంపు సెట్లకు ఉదయం 9గంటల విద్యుత్ సరఫరా చేయాల్సివుంది. అది సక్రమంగా అమలు కాకపోవడంతో మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాల సాగుకు వ్యయ ప్రయాసలకోర్చి నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పట్టణ ప్రాతాల్లో రోజుమార్చి రోజు ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నారు. దీనితో ఐదు గంటలపాటు సరఫరా నిలిపివేస్తున్నారు. వేసవి ప్రారంభం ముందే కోతలు మొదలయ్యాయని ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణకు ద్రోహం చేసిందే మీరంతా

- నీళ్ల దోపిడీపై కేంద్రాన్ని, చంద్రబాబును నిలదీయండి
- కృష్ణాజలాల వివాదంపై బీఆర్ఎస్ నేతల విమర్శలు




**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** నీటి దోపిడీ బీఆర్ఎస్ నేతలపై విమర్శలు చేయడం మానేసి కేంద్రం, చంద్రబాబును ప్రశ్నించాలని కాంగ్రెస్‌పై బిఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు ఏమైనా ద్రోహం జరిగిందంటే దానికి కాంగ్రెస్ పార్టీ, బీజేపీ,చంద్రబాబు నాయుడు, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి బాధ్యులని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అవినీతి గురించి ప్రజలే మాట్లాడుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ దాచిపెట్టుకున్న కృష్ణా నీళ్లను ఏపీ ఎత్తుకెళ్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ఏపీ నీటి దోపిడీతో తెలంగాణలో సాగు, తాగు నీళ్లకు కటకట ఏర్పడే పరిస్థితి ఉందని చెప్పారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. నీళ్లలో నిప్పులు పుట్టించి ఉద్యమం నడిపిన పార్టీ తమదన్నారు. తెలంగాణపై అన్ని విషయాల్లో పరిశోధించిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస సోయి లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, బొల్ల మల్లయ్య యాదవ్‌తో కలిసి ఆయన మిడియాతో మాట్లాడారు. కృష్ణా నీళ్ల దోపిడీ జరుగుతున్నదని, అడ్డుకోవాలని హరీశ్ రావు సలహా ఇచ్చారన్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో వాటాకు మించి ఏపీ నీళ్లు తీసుకెళుతున్నదని చెప్పారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగు, తాగు నీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మన హక్కుగా ఉన్న 123 టీఎంసీల గురించి మాట్లాడాలన్నారు. నీటి విషయంలో మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ చెత్త మాటలు మాట్లాడారు. ఉత్తమ్‌వి ఉత్తరకుమార మాటలు. రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి మాట్లాడితే కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ అన్యాయం చేసింది కాంగ్రెస్, బీజేపీలే. తెలంగాణకు సరైన నీటి వాటా దక్కకపోవడానికి చంద్రబాబు, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీలే కారణం. ఉత్తమ్ కుమార్ ఎవరో రాసిచ్చింది చదివారు. రేవంత్ రెడ్డి తిట్లతో సీఎం అయ్యారు. తాను కూడా అదే భాషతో మాట్లాడితే ముఖ్యమంత్రి అవుతానని ఉత్తమ్ అనుకుంటున్నారేమో. పదేండ్ల కేసీఆర్ పాలనలోసాగు తాగు నీళ్లకు ఎలాంటి కష్టం రాలేదు. రేవంత్ రెడ్డి మాట్లాడిన చెత్తనే కేసీఆర్ మీద ఉత్తమ్ మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడాల్సింది కేంద్రం మీద. పక్క రాష్ట్రం చంద్రబాబు మీద, ఏపీలో ప్రాజెక్టుల మీద. ప్రాజెక్టుల విషయంలో జగన్, చంద్రబాబు ఒకే వైఖరితో ఉన్నారు. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. పోతిరెడ్డిపాడు ను వ్యతిరేకించి ఆనాడు మా పార్టీ వైఎస్ కేబినెట్ నుంచి బయటకు వచ్చింది. మాట్లాడుకుంటే తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహ చరిత్ర చాలా ఉంది. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోసం ప్రయత్నిస్తున్నామని ఉత్తమ్ అంటున్నారు. ముందు ఉన్న పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలి. మోదీకి, చంద్రబాబుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి భయపడుతున్నారు. జగన్ సీఎంగా రాష్ట్రానికి వస్తే గౌరవించుకోవద్దా. మీరు చంద్రబాబు దగ్గరికి క్యూ కట్టలేదా. మాట్లాడటానికి సిగ్గు ఉండాలి. కాంగ్రెస్ అవినీతి గురించి మాట్లాడుకుంటే అవినీతి అనే పదమే సిగ్గుపడుతుంది. ప్రతి దాంట్లో కమిషన్ అడుగుతున్న కాంగ్రెస్ నేతలా కేసీఆర్ గురించి మాట్లాడేది. మంత్రుల అవినీతి సంపాదన చిట్టా మా దగ్గర ఉంది. ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల దగ్గర మంత్రులు కమిషన్ తీసుకుంటున్నారు. పంటలను కాపాడుకోవడానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మనకు దక్కాల్సిన కృష్ణా జలాలు దక్కాలి. దీనికోసం బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుంది. మంత్రులు కృష్ణా జలాలపై సోయి లేకుండా సొల్లు పురాణం చెబుతున్నారు. కాళేశ్వరాన్ని ఎండబెట్టారు కాబట్టే గతంలో మాదిరిగా సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నీళ్లు రావడం లేదు. కేసీఆర్‌ను తిట్టడం బంద్ చేసి కృష్ణా జలాల వాటాను సాధించు కోవడం మీద మంత్రులు ద్రుష్టి పెట్టాలి. మా హయాంలో పదిహేడు పంట సీజన్లకు నీళ్లిచ్చాం. కేసీఆర్ హయంలో ఏపీకి నీళ్లు అక్రమంగా తరలిస్తే ఇన్ని పంటలు పండటం సాధ్యమా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెరిగిన పంట విస్తీర్ణం, పంట ఉత్పత్తికి సాగునీళ్ల సక్రమ వాడకమే కారణం. సర్పంచ్‌కు కూడా సమాధానం చెప్పలేని స్థాయి కాంగ్రెస్ నేతలది. వీళ్లా కేసీఆర్ గురించి మాట్లాడేది. ఇప్పటికైనా సోయి తెచ్చుకుని సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. అసలు నీళ్లను ఎట్లా కొలుస్తారో కాంగ్రెస్ నేతలకు తెలుసా. ఉద్యమం నుంచే టీఎంసీల గురించి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అవగాహన కల్పించారు. కేసీఆర్‌ను విమర్శించడానికి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి సిగ్గుండాలి. కేంద్ర మంత్రులుగా ఉన్న వారికే కేఆర్ఎంబీ అధికారులతో మాట్లాడి తెలంగాణకు రావల్సిన నీళ్లు సాధించడం చేతకాదా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

# చెట్లు నరకితే కఠిన చర్యలు

- మొక్కల రక్షణకు ఏర్పాట్లు



**నిజామాబాద్, ఫిబ్రవరి 21:** మొక్కల పెంపకంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా అటవీ అధికారులు అన్నారు. అక్రమంగా చెట్లను నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కోతుల బెడద పేరుతో చెట్లను నరుకుతున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామాల్లో పచ్చదనం కరువవుతుందన్నారు. చివరకు పీల్చడానికి గాలికూడా దక్కదని అన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా చెట్లను నరికినా, దొంగకర్ర ఎగుమతి చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్ల సంరక్షణ పౌరుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల నర్సరీల్లో ఎండాకాలం వాటిని కాపాడడానికి అటవీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండల నుంచి కాపాడటానికి సన్నాహాలు చేస్తున్నారు. మొక్కలు ఎండల నుంచి తట్టుకునేలా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కలను నాటి టార్గెట్ పూర్తిచేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఒకరు అన్నారు. ఎండల నుంచి మొక్కలకు రక్షణ ఉండేందుకు గ్రీన్‌షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొక్కల పెంపకంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వీటి పెంపకంలో క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా అలర్ట్ చేశాం. గ్రామప్రాంతాల్లో మొక్కలు నాటడానికి అనువుగా అన్నీ సిద్ధం చేశామని అన్నారు. పంపిణీ చేయడానికి మొక్కలను వననర్సరీల్లో సిద్ధం చేసామన్నారు. ఆయా నర్సరీల్లో గ్రామాల్లో అందజేయడానికి మొక్కలు సిద్దంగా ఉన్నాయి. వివిధ రకాల నీడనిచ్చే, పండ్ల, పువ్వుల మొక్కలను సైతం పెంచుతున్నారు. ప్రధానంగా టేకు, వేప, కానుగ, ఖర్జూర, ఈత, నెమలినార, చింత, దానిమ్మ, జామ, గుల్మోర్గ, మర్రి, రావి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వేసవిని తట్టుకునే మొక్కలు కూడా ఉన్నాయి. కాగా ఎండల నుంచి మొక్కలను కాపాడుకోవడానికి షెడ్‌నెట్‌లను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి అధికారులు కూడా నర్సరీలను సందర్శించి మొక్కల వివరాలను సేకరించారు.

# అప్పుడే విమర్శలా

## దిల్లీ సిఎం రేఖాగుప్తా మండిపాటు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. ఒక్కరోజుకే విమర్శలు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా.. మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది. ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు.

# నాలాల విస్తరణకు రాజకీయ గ్రహణం?

## భారీ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న స్వార్థం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** రాజధానికి పెనుముప్పుగా పరిణమించిన నాలాల విస్తరణకు కొంతమంది ప్రజాప్రతినిధులే అడ్డంకిగా తయారయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద నాలాలను విస్తరించడం వల్ల నగరంలో ఎంత వర్షం పడినా ఒక్క ప్రాంతానికీ ముంపు ముప్పు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇటీవల హైడ్రా చర్యలను ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా సర్వే పూర్తయినా ఇంతవరకు విస్తరణ పనులు మొదలు కాలేదు. ఆక్రమణలతో ప్రవాహ సామర్థ్యం తగ్గి వర్షాకాలంలో ఆ నీరంతా కాలనీలను ముంచెత్తుతోంది. రాజకీయ ప్రయోజనాలను ఆశించి కొందరు అడ్డు తగలడంతో ముంపు ఇబ్బందులను తెచ్చిపెడుతున్నారు. ఫలితంగా ఆస్తి నష్టంతోపాటు అనేకమంది నిరాశ్రయులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో నాలాల వ్యవస్థను గాడిలో పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకు అనుగుణంగా నాలాల ఆక్రమణలపై సర్వేకు ఆదేశించారు. నాలాలను చాలా వరకు విస్తరిస్తే భవిష్యత్తులో ముంపు ఇబ్బంది ఉండదన్న భావనలో అధికారులకు తగు సూచనలు చేసి ప్రణాలికలు రూపొందించారు. వచ్చే వర్షాకాలం నాటికైనా కొన్ని నాలాలపై ఆక్రమణలను తొలగించి విస్తరించపోతే మళ్లీ నగరానికి ముంపు ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే నగరంలోని కొంతమంది ప్రజాప్రతినిధులు పది అడుగుల మేర విస్తరిస్తే వేలాది ఆక్రమణలను తొలగించాల్సి వస్తుందని, అదే జరిగితే ఆమక్రణదారుల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఆక్రమణలు తొలగించకుండా నాలాలు విస్తరించకుండా ప్రస్తుతమున్న నాలాల్లో లోతుగా పూడిక తీస్తే సరిపోతుందని వీరి వాదనగా ఉంది. ఆక్రమణల తొలగింపు మొదలుపెడితే ప్రజల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి వచ్చే అవకాశం ఉందని వీరు భయపడుతున్నారు. అందుకే విస్తరణకు మోకాలడ్డు తున్నారు. ప్రజాప్రతినిధులు ఒత్తిడితో నాలాల ఆక్రమణ తొలగింపు విస్తరణ వేగంగా ముందుకు వెళ్లడం లేదు. ఎలాగూ నిధులు సమస్య ఉంది కాబట్టి నాలాల్లో పూడిక తొలగింపుపైనే మహానగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టారు. ఈ నాలాలపై దాదాపు 12 వేల వరకు ఆక్రమణలు ఉన్నాయని తేల్చారు. వర్షపు నీరు వెళ్లేందుకు ఉన్న కాలువలన్నీ మురుగు నాలాలుగా మారిపోయాయి. గతంలో వర్షాకాలంలో నిజాంపేట, బాచుపల్లి, బండారి లేఅవుట్, నాచారం, ఆల్విన్ కాలనీ తదితర అనేక ప్రాంతాలు ముంపు నీటిలో చిక్కుకున్నాయి. వీటిని ఎంతమేర విస్తరించాలన్న దానిపైనా సర్వేలో గుర్తించి అందుకు అనుగుణంగా మార్కింగ్ చేశారు. ప్రస్తుతం నగరంలో పడే వర్షం నీటినీ పరిగణనలోకి తీసుకుని ఈ నాలాలను కనీసం పది అడుగుల మేర అదనంగా విస్తరించాల్సిందేనని నిపుణులు తేల్చి చెప్పారు. లేని పక్షంలో భారీ వర్షాలొస్తే అనేక కాలనీలు ముంపు నీటిలో ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు.

# ఎల్ ఆర్‌ఎస్ పేరుతో రూ.50 వేల కోట్ల దోపిడీకి స్కెచ్

**బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో....**

**కేంద్ర బడ్జెట్ పై దమ్మంటే బహిరంగ చర్చకు రండి**

**మీకు చేతనైతే బీసీ రిజర్వేషన్లపై టెన్ జనపథ్ ఎదుట ధర్నా చేయండి**

**కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలివి**

**రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్**



పెద్దపల్లి : లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) పేరుతో కాంగ్రెస్ నేతలు రూ.50 వేల కోట్ల దండుకునేందుకు స్కెచ్ వేశారని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ పేరిట పైసలు ఎవరూ చెల్లించొద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రజలకు ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని గత ఎన్నికల్లో హామీలిచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు డబ్బులు ఎందుకు దండుకోవాలనుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేటి సీఎం, నాటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కలు మాట్లాడిన మాటల వీడియో క్లిప్పింగ్స్ ను బండి సంజయ్ మీడియాకు విడుదల చేశారు. ఇచ్చిన మాట మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాల్సిందేనని, లేనిపక్షంలో ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు పెద్దపల్లి జిల్లా కేంద్రానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్థానిక నేతలు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, ఇతర నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను, ఉద్యోగులను, ఉపాధ్యాయులను నిండా ముంచింది. ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని మాట తప్పారు? 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేన్ ఇచ్చి .. వాటిలో ఇప్పటి వరకు ఒక్కటి కూడా భర్తీ చేయలేదు. నియామకాల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో కొనసాగుతోంది. కానీ ఏకంగా 55 వేల పోస్టులను భర్తీ చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పోస్టులన్నీ గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ఫలితమే నని సంజయ్ గుర్తు చేశారు. యువతకు నెలకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పారు. 14 నెలల పాలనలో ఒక్కో నిరుద్యోగికి 56 వేల రూపాయలు కాంగ్రెస్ బాకీ పడింది. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లి%శీ%చకపోవడంతో 7,500 కోట్ల బకాయిలు పేరుకు పోయినయ్. దీనివల్ల విద్యాసంస్థల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. 15 శాతం కమీషన్ ఇస్తేనే ఫీజు రీయంబర్స్ మెంట్ బిల్లులు చెల్లిస్తామని కొందరు మంత్రులు చెబుతున్నారట. ఇంతకంటే దుర్మార్గం ఇంకేమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తొలి పీఆర్సీ జాప్యంవల్ల 21 నెలల పాటు నష్టపోయారు. ఇప్పుడు రెండో పీఆర్సీని నేటికీ అమలు చేయకపోవడంవల్ల 20 నెలలుగా నష్టం జరుగుతూనే ఉన్నా కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. 317 జీవో తెచ్చి కేసీఆర్ ప్రభుత్వం చెట్టుకొకరిని పుట్టకొకరిని చేస్తే ఈ జీవోను సవరించి న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల మీద కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అమలు చేసి చర్యలు తీసుకోలేదు. 5 డీఏలు పెండింగ్ లో పెట్టింది. సరెండర్ లీవ్స్ ఎన్ క్యాష్ మెంట్ చేసుకునే అవకాశం లేదు. ఆఖరికి జీతం పైసల్లోంచి దాచుకున్న జీపీఎఫ్, గ్రాట్యుటీ పైసలు కూడా ఇవ్వడం లేదని మంత్రి ఆరోపించారు. పట్ట భద్రుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన బీజేపీ చేసిన పోరాటాలను, త్యాగాలు చేసింది బీజేపీ మాత్రమే. జీతాల కోసం కొట్లాడి ఫస్ట్ నాడు జీతమొచ్చేలా చేసినం. బదిలీలు, ప్రమోషన్ల కోసం లాఠీదెబ్బలు తిని సాధించినం. 317 జీవోపై యుద్ధం చేసి జైలుకు వెళ్లినం. గ్రూప్1 పేపర్ లీకేజీపై కొట్లాడితే హిందీ పేపర్ లీకేజీ అంటూ దొంగ కేసు పెడితే జైలుకు పోయినా భయపడలే. జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్ చేసినం అని గుర్తు చేశారు. కుల గణన అంతా తప్పుల తడక. బీసీ జనాభాను తగ్గించే కుట్ర జరుగుతోంది. బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తే... ఇక మిగిలేది 32 శాతమే. ముస్లిం రిజర్వేషన్లకు మేం బరాబర్ వ్యతిరేకం. ముస్లింలను కలిపి బీసీ బిల్లు పంపితే కేంద్రం నుండి మళ్లీ వెనక్కు పంపి తీరుతాం. ముస్లింలను తీసేసి 42 శాతం బిల్లు పంపితేనే కేంద్రాన్ని ఒప్పిస్తాం... బీసీ రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసినందుకు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో టెన్ జనపథ్, ఏఐసీసీ కార్యాలయం వద్ద, హైదరాబాద్ లో గాంధీ భవన్ వద్ద ధర్నా చేయాలని సూచించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) పేరుతో రూ.50 వేల కోట్లు దండుకునేందుకు సిద్ధమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్, సీతక్క తదితరులు చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? "ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేస్తాం. పైసలు తీసుకోం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేస్తాం... బీఆర్ఎస్ చేస్తానంటే చేయించుకోకండి"అని మీరు చెప్పింది నిజం కాదా? ఇదిగో ఆధారాలు..అంటూ వీడియో క్లిప్ ను విడుదల చేశారు. ఆనాడు రేవంత్ రెడ్డి ఏమన్నడు.. బీఆర్ఎస్ పోయింది...ఎల్ ఆర్ఎస్ వచ్చింది. రేపు ఎంఆర్ఎస్ (మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీం) ను కూడా కేసీఆర్ తెస్తడని అనలేదా? మరి మీరు చేస్తుందేమిటి? ఎల్ఆర్ఎస్ తో పైసలు దండుకోవాలనుకుంటున్నారా? ఆ పైసలు చాలవని రేపు మనిషి పుట్టినా, చచ్చినా కూడా పైసలు కట్టాలని డీఆర్ఎస్ (డెత్ రెగ్యులరైజేషన్ స్కీం) బీఆర్ఎస్(బర్త్ రెగ్యులరైజేషన్ స్కీం) తెస్తారా? ఏంది? తెచ్చినా తెస్తారు... అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయబోయే పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయులందరినీ వేడుకుంటున్నా... కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలివి. నయవంచనకు... ధర్మ రక్షణకు మధ్య జరుగుతున్న ఎన్నికలివి. ఈ ఎన్నికల్లో తీర్పు కోసం యావత్ రాష్ట్రం ఎదురు చూస్తోంది. మీతోపాటు సామాన్య ప్రజలు కూడా మీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరుకుంటున్నాని బండి సంజయ్ కోరారు.

# ఐక్యంగా నరేందర్ రెడ్డిని గెలిపించుకుందాం

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.**



జనత న్యూస్ బెజ్జంకి : కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బెజ్జంకి మండల కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి , అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో నా గెలుపు కోసం ఎలాగైతే ప్రతి కార్యకర్త కష్టపడ్డారో, అలాగే మన పార్టీ అభ్యర్థి ని ఎమ్మెల్సీగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఐక్యంగా నరేందర్ రెడ్డి ని గెలిపించుకుందామని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ , మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, విఎన్ఆర్ మండల టీం ఇంచార్జ్ కొంపెల్లి రవీందర్, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యకర్తలారా.... ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ దమ్ము చూపించండి



**స్థానిక ఎన్నికల్లో మిమ్ముల్ని గెలిపించే బాధ్యత తీసుకుంటాం**

**బీజేపీ ఒక్కసారైనా తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే మన లక్ష్యం...**

**బీసీల్లో ముస్లింలను కలిపి బిల్లు పంపితే ఆమోదించే ప్రసక్తే లేదు...**

**పెద్దపల్లిలో బీజేపీ పచ్చీస్ ప్రభారీ సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు..**

**పెద్దపల్లి,జనతా న్యూస్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా బీజేపీ బలపర్చిన అభ్యర్థుల విజయం తథ్యమని చెబుతున్నాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలంతా తమ పౌరుషాన్ని, దమ్ము చూపాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే.... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులుగా గెలిపించే బాధ్యత తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన్ గార్డెన్స్ లో బీజేపీ పచ్చీస్ ప్రభారీ (25 మం ఓటర్లకు ఒక ఇంచార్జ్)ల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కాశీపేట లింగయ్య, గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, బీజేపీ టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీని ఒక్కసారైనా అధికారంలోకి తీసుకురావాలని లక్షలాది మంది కార్యకర్తలు కల కంటున్నారని, ఎంతో మంది ఆ కల నెరవేరకుండానే చనిపోయారని చెప్పారు. ఈసారి బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. నక్సలైట్ల తూటాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ నాయకులకే ఉందన్నారు. పెద్దపల్లి జిల్లాలోనూ గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్ రావు, కాశీపేట లింగయ్య, కోమాల అంజనేయులు వంటి వారిని చంపాలని నక్సలైట్లు పెద్ద పోస్టర్లు కూడా వేశారని గుర్తు చేశారు. అయినా భయపడకుండా నక్సలైట్లకు ఎదురొడ్డి పోరాడి కాషాయ జెండాను రెపరెపలాడించారని చెప్పారు.బీసీలకు రిజర్వేషన్ల పేరుతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. "మనకు గోత్రం, జన్మ నామం, జన్మ నక్షత్రం ఉంటుంది. మొల దారం కట్టుకుంటాం. మన సంప్రదాయాలు వేరు.. మరి హిందువుల జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? ఒకవైపు బీసీ జనాభాను తగ్గించి చూపుతున్నారు. ఇంకోవైపు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్ప అందులో 10 శాతం ముస్లింలకే ఇస్తున్నారు.. బీసీలకు ద్రోహం చేస్తుంటే ఎట్లా ఊరుకుంటాం. అందుకే బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బిల్లు పంపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. వెనక్కు తిరిగి పంపుతాం. ముస్లింలను మినహాయించిన తరువాతే బీసీ బిల్లును ఆమోదిస్తాం... సమావేశానంతరం గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ఆహ్వానం మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పెద్దపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులతోపాటు స్థానిక నాయకుల తో కలిసి బండి సంజయ్ భోజనం చేశారు.

# పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్,జనతా న్యూస్: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పదవ తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూపరింటెండెంట్లు ప్రతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించాలని, అక్కడ అన్ని వసతులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి గదిలో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలని, మరుగుదొడ్లు వినియోగంలో ఉండాలని అన్నారు. విద్యార్థులందరికీ తాగునీరు వసతి కల్పించాలని తెలిపారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్షకు ముందు ప్రతి విద్యార్థికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని సూచించారు. గుర్తింపు పొందిన వారు మినహా పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరాదని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు కూర్చోవడానికి మంచి ఫర్నిచర్ వాడాలని, మాల్ ప్రాక్టీస్ కి అవకాశం ఇవ్వరాదని తెలిపారు. దివ్యాంగులు పరీక్ష రాసేందుకు సౌకర్యవంతమైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని అన్నారు. వీలైన చోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ ఒకే గేటు నుంచి ఉండేలా చూడాలని అన్నారు. నిబంధనలు అనుసరించి 10వ తరగతి పరీక్షలు సాఫీగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి..



**గ్రాడ్యుయేట్ మేనిఫెస్టోను అమలు చేస్తాం..**

**అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్..**

కరీంనగర్,జనతా న్యూస్: క్రీడాకారులు, వాకర్స్, యువకులు, గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఉదయం కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లతో కలిసి వెలిచాల రాజేందర్ రావ్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్టేడియం మొత్తం కలియతిరిగి క్రీడాకారులు, యువకులు వాకర్స్ ను కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి అందరూ అండగా ఉండి గెలిపించాలని కోరారు. నరేందర్ రెడ్డిని గెలిపిస్తే మేనిఫెస్టోలో ఉన్న ప్రతి అంశాన్ని కృత నిశ్చయంతో అమలు చేసి తీరుతామని ఘంటా పదంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. యువతీ, యువతల కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఇందులో యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి నైపుణ్యం పెంచే దిశగా ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి మరింత ధైర్యం ఇవ్వాలని రాజేందర్ రావు సూచించారు. రాబోయే ఐదు రోజులపాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వాడవాడను ప్రతి గ్రాడ్యుయేట్ ను కలిసి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కష్టపడి పనిచేయాలని రాజేందర్ రావు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకుల నరసన్న, మాచర్ల ప్రసాద్, పులి ఆంజనేయులు, పత్తెం మోహన్, టేలా భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ఓటర్లను ప్రలోభ పెట్టకుండా పకడ్బందీ నిఘా**

**డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు**

**ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ఎమ్మెల్సీ ఎన్నికల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించిన సీఈఓ**




కరీంనగర్,జనతా న్యూస్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను, పోలీస్ కమిషనర్లను, ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్ , టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పై జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా గట్టి నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని, డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడుల నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని అధికారులకు తెలిపారు.

టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మేర సౌకర్యాలు ఉండే విధంగా చూడాలని, పోలింగ్ కేంద్రాలకు సంబంధిత అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు తనిఖీ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, అక్కడ సీసీ కెమెరాలు. వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్రతి పోలింగ్ బృందానికి అవసరమైన మేర పోలింగ్ సామాగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పోస్టల్ బాక్స్ అదేవిధంగా చూడాలని, వీటి తరలింపుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందించాలని ఆయన తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ అందించామని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలప్రక్రియలో 36 మంది మైక్రో అబ్జర్వర్లను, 144 మంది ప్రిసైడింగ్ అధికారులను, 373 మంది పోలింగ్ అధికారులను ఎన్నికల కోసం నియమించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 30 లోకేషన్లలో 103 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీరందరికీ శిక్షణ ఇచ్చామని తెలిపారు. పోలింగ్ స్లిప్పుల ప్రక్రియ పూర్తికావస్తోందని అన్నారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇందుకు అవసరం ఐన వాహనాలు సమాకుర్చుకోవడం జరిగింది అనీ అన్నారు వివిధ జిల్లాల నుండి కరీంనగర్ రిసెప్షన్ సెంటర్ కు వచ్చే బ్యాలెట్ బాక్స్ లకు కరీంనగర్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల వద్ద ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలకు వేరువేరుగా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. బాలట్ బాక్స్ ల ఓవర్ ఆయిలింగ్ ప్రక్రియ పూర్తి ఐయ్యింది అని తెలిపారు. పొలిటికల్ పార్టీల సమావేశం ఇదివరకే నిర్వహించామని అన్నారు. పోలీస్ శాఖ సమన్వయంతో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలం ముత్తన్నపేట గ్రామానికి చెందిన స్వేరోస్ నెట్వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్ర సురేష్ తల్లి బొర్ర బుచ్చవ్వ ఇటీవల మృతి చెందగా , మానకొండూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, పార్టీ నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా, కనగండ్ల తిరుపతి, ఎలా శేఖర్ బాబు, శ్రీను, శంకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## స్వేరోస్ ఆత్మీయ పలకరింపు



స్వేరోస్ నెట్వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్ర సురేష్ మాతృ వియోగంతో బాధపడుతుండగా శుక్రవారం సెరోస్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు ఉప్పులేటి బాబు, గడప రాజు, సుభద్ర, శ్యామల, మారుతి, మెట్ల శంకర్, మంద జనార్ధన్, గాజుల బాబు, నరసింహుల దశరథం, బోనగిరి ప్రభాకర్, చిలుముల మోహన్, విజనేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లూరి పరుశరాములు, మహంకాళి రాజు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ కి అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు...

**సమ్మిళిత అభివృద్ధి.. పెట్టుబడుల సాధనే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన....**

**12 లక్షల వరకు పన్ను మినహాయింపు కోట్లాదిమందికి ఊరటనిచ్చే విషయం...**

**ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి....**



కరీంనగర్,జనతా న్యూస్: 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యానికి అనుగుణంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని , దేశ స్థితిగతిని మార్చే విధంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని, త్వరిత, సమ్మిళిత, అభివృద్ధి, పెట్టుబడుల సాధన లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అద్భుతమైన బడ్జెట్ రూపొందించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యులు దగ్గుపాటి పురందరేశ్వరి అన్నారు. 2025- 2026 కేంద్ర బడ్జెట్ పై శుక్రవారం రోజున కరీంనగర్లోని వైశ్య భవన్లో మేధావులతో సదస్సుకు పురందరేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరైమాట్లాడారు. అంతకుముందు కరీంనగర్లోని శ్వేతా హోటల్లో బడ్జెట్ కేటాయింపుల అంశంపై మీడియాతో ఆమె మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల పై తగిన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలుజరుగుతున్నాయన్నారు. ప్రధానంగా బడ్జెట్లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. రక్షణ , విద్య, వైద్యం, వ్యవసాయం, స్కిల్ డెవలప్మెంట్ ల కు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రక్షణ రంగానికి 6 లక్షల 80 వేల కోట్లు, హోం మంత్రిత్వ శాఖకు రెండు లక్షల 33 వేల కోట్లు, వ్యవసాయ రంగానికి రెండు లక్షల 75 వేల కోట్లు , వైద్యానికి 96 వేల కోట్లు, విద్యకు 50 వేల కోట్లు ఇలా ప్రతి ఒక్క ప్రధాన రంగానికి అద్భుతమైన కేటాయింపులు ఈ బడ్జెట్ లో జరిగాయన్నారు. ముఖ్యంగా 12 లక్షల వరకు ఇన్కమ్ టాక్స్ లేదనే ప్రకటన కోట్లాదిమంది కి సంతోషాన్ని ఇచ్చిందన్నారు. గరీబి హటావో నినాదంతో దేశాన్ని దశాబ్దాలు ఏలిన కాంగ్రెస్ పేదరికాన్ని నిర్మూలించలేకపోయిందన్నారు. గత పదేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, సంస్కరణలతో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అభివృద్ధి మందగించిన భారత్ మెరుగైన పనితీరు సాధించిందన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట , అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచిత రేషన్ బియ్యం, గ్రామీణ ఉపాధి హామీ పనులునిధులతో డంపు యార్డ్ నిర్మాణాలు, సిసి రోడ్లు, డ్రైనేజీలు , స్వచ్ఛభారత్ ద్వారా గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం , పల్లె ప్రకృతి వనాలు , ప్రతి గ్రామంలో వీధి దీపాలు, పంట నష్ట పరిహారం కింద పసల్ బీమా యోజన, మహిళలకు ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు , ప్రధానమంత్రి మాతృ వందన యువజన ద్వారా గర్భిణీ స్త్రీలకు సహాయం, దేశంలోని ప్రతి ఒక్కరికి బ్యాంక్ అకౌంట్ ను కల్పించాలనేఉద్దేశంతో జన్ ధన్ యోజన ( జీరో అకౌంట్స్) తీసుకువచ్చి , ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి భీమా యోజన స్కీంలను అమలు చేస్తూ, నేరుగా ప్రతి సంక్షేమ ఫల మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందన్నారు. అలాగే ఆడపిల్లల భవిష్యత్తు కోసం సుకన్య సమృద్ధి యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన, పీఎం కిసాన్ మన్ ధన్ యోజన బ్యాంకు ద్వారా 60 సంవత్సరాలు దాటిన వ్యవసాయ కూలీలకు పింఛన్ పొందే పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, సంసద్ ఆదర్శ గ్రామ యోజన , రాష్ట్రీయ గ్రామీణ అజీవక మిషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా నిరుద్యోగులకు స్కిల్స్ కొరకు దేశవ్యాప్తంగా ఉచిత ట్రైనింగ్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ప్రతి ఒక్కరిఇంటి కల నెరవేర్చడం, ప్రధానమంత్రి ముద్ర యోజన ( చిన్న వ్యాపారుల రుణం కోసం), అటల్ పెన్షన్ యోజన , ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో 18 కులాలు 14 చేతివృత్తుల వారికి లబ్ధి చేకూర్చే ప్రోగ్రాం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అలాగే స్టార్టప్, (మేకింగ్ ఇండియా ప్రోగ్రాం ) ద్వారా అంకుర పరిశ్రమలు, సర్వీస్ రంగాలకు తగిన ప్రోత్సాహం, నేషనల్ లవ్లీ స్టాక్ మిషన్ , నాన్ అగ్రికల్చర్ (డైరీ, కోళ్ల, ఫిష్ యూనిట్లకు 50 లక్షల సబ్సిడీ తో) కార్యక్రమాలు, రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా స్వదేశీ ఆవుల రక్షణ , జాతుల అభివృద్ధి కొరకు, పాల ఉత్పత్తుల పెంపుదల కొరకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీలు అందిస్తుంది అన్నారు. లేబర్ ఇన్సూరెన్స్, ఈ శ్రమ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఆయుష్మాన్ భారత్ లాంటి స్కీంలతో ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేసిందన్నారు. అలాగే రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు , బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనార్టీ, నిరుద్యోగుల సంక్షేమం, అభివృద్ధికోసం అనేక పథకాలను తీసుకువచ్చి , వారందరికీ చేయూతనిస్తోందన్నారు. పదేళ్ల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ప్రస్తుతం బడ్జెట్లో మరిన్ని కొత్త పథకాలను ప్రకటించిందన్నారు . పప్పు ధాన్యాల ఉత్పత్తికి, పండ్లు కూరగాయల ఉత్పత్తికి పీఎం దన్ దాన్య కృషి యోజన పేరుతో కొత్త పథకాన్ని పైలట్ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి 3 లక్షల నుండి 5 లక్షల వరకు పెంపు, క్యాన్సర్ తో పాటు 36 రకాల ప్రాణం తగ్గ వ్యాధులకు సంబంధించిన మెడిసిన్ పై కష్టం డ్యూటీ మినహాయించడం , ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయడం , క్యాన్సర్ పేషెంట్లకు అవసరమైన మందులు చావుకోగా లభించే విధంగా బడ్జెట్లో కేటాయింపులు చేశారన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సంపదను సృష్టించడం కోసం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి, మహిళల అభివృద్ధి కోసం బడ్జెట్లో తగిన నిధులు కేటాయించారని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా బడ్జెట్ ఉందన్నారు. కానీ తల పేరుతో ప్రజలను మాయం చేసే వాళ్లకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు మింగుడు పడడం లేదన్నారు. బడ్జెట్ కేటాయింపులు ప్రతిపక్షాలకు, కొన్ని వర్గాలకు భయం కలిగించిందన్నారు. ఇట్టి సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, వికసిత్ భారత్ బడ్జెట్ ప్రోగ్రాం స్టేట్ కోఆర్డినేటర్ గంగిడి మనోహర్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే బుడిగే శోభ, జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, తాజా మాజీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి



## జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి

సిద్దిపేట,జనతా న్యూస్: మాల్ ప్రాక్టీస్ కు తావు లేకుండా జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరెట్ జిల్లా కలెక్టర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. అనురాధతో కలిసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి మార్చి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 43 పరీక్షా కేంద్రాల్లో 20595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 9770, సెకండ్ ఇయర్ 10815 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి,ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమా అగ్రవాల్, రెవిన్యూ అబ్దుల్ హమీద్ ఆర్డీఓలు సధానందం, చంద్రకళ, అడిషనల్ డిసీపీ సుభాష్ చంద్రబోస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పల్వాన్ కుమార్ ,విద్యుత్ శాఖ ,ఆర్టీసీ, పోస్టల్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ ప్రచారం





జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలంలో కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీలు వారి వారి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారంలో దూసుకెళ్తున్నారు, శుక్రవారం వీరాపూర్ గ్రామంలో బిజెపి పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపు కోసం మండల కిషన్ మోర్చా అధ్యక్షులు రాచకొండ శ్రీధర్ రావు పార్టీ కార్యకర్తలు కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలోని పెరికబండ , గుండారం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఊట్కూరి నరేందర్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి మండల ఉపాధ్యక్షులు కర్రావుల శంకర్ నేతృత్వంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

# ఫంక్షన్ హాల్ నిర్వహణకు టెండర్

## పిఎసిఎస్ సీఈవో మంచాల శ్రీనివాస్



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇటీవల నిర్మించిన ఏసీ ఫంక్షన్ హాల్ నిర్వహణకు గత 15 రోజుల క్రితం, 15 లక్షల నిర్వహణ తో టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క టెండర్ రానందున, మళ్లీ నిర్వహణ భారం 12 లక్షలకు సవరించి టెండర్ నిర్వహిస్తామని ప్రాథమిక సహకార సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మంచాల శ్రీనివాస్ శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు 28/2/2025 రోజులోపు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకొని డిపాజిట్ గా 50వేల రూపాయలు చెల్లించి రసీదు తీసుకోవాలని సూచించారు.

# ఆ లోటును పూరిస్తూ..
# వచ్చేశాడు
## భారత జట్టులో కీలక పేసర్ మహ్మద్ షమి



2023 వన్డే ప్రపంచకప్‌లో అదిరే ప్రదర్శనతో జట్టు ఫైనల్ చేరడంలో ప్రధాన పాత్ర పోషించాడు మహ్మద్ షమి. కానీ.. గాయం అతడిని చాలా నెలలు టీమ్‌ఇండియాకు దూరం చేసింది. ఇటీవలే ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో పునరాగమనం చేశాడు. అయితే అతడికి అసలైన గ్రాండ్ ఎంట్రీ ఛాంపియన్స్ ట్రోఫీతోనే లభించింది. బంగ్లాదేశ్‌తో తొలి పోరులో అదిరే బౌలింగ్‌తో అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడీ పేసర్. ఐసీసీ టోర్నీలు తనకు మరోసారి కలిసొస్తాయని నిరూపించు కున్నాడు. ముఖ్యంగా వన్డేల్లో తన సత్తాను మరోసారి నిరూపించుకున్నాడు.

### అదే పేస్.. అదే పదును

ఐసీసీ టోర్నమెంట్ అంటే చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ షమి మాత్రం ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చాలా తేలిగ్గా వికెట్లు పడగొడతాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడు బంతిని బ్యాక్ ఆఫ్ లెంగ్త్, షార్ట్ లెంగ్త్ వేస్తూ బ్యాటర్లను బుట్టలో వేస్తున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో షమి ఇదే సూత్రాన్ని ఉపయోగించాడు. వికెట్ టు వికెట్ బౌలింగ్‌తో బంగ్లా బ్యాటర్లను కట్టడి చేశాడు. షాట్ కొట్టేలా ప్రేరేపించి బ్యాటర్లు తప్పు చేసేలా చేశాడు. గాయం తర్వాత లైన్ అండ్ లెంగ్త్‌ను కాస్త సర్దుకోవడం కూడా అతడికి కలిసొచ్చింది. మరోసారి ఐసీసీ టోర్నీల్లో అయిదు వికెట్ల ఘనత సాధించాడు. ఐసీసీ వన్డే టోర్నీల్లో 60 వికెట్లు తీసిన అతడు జహీర్‌ఖాన్‌ను దాటి అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో వన్డే ఫార్మాట్లో 200 వికెట్లు సాధించి మరో మైలురాయి అందుకున్నాడు. విజ్డన్ ప్రకారం 50 ఓవర్ల ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలో ఉత్తమ సగటు, ఉత్తమ వికెట్ టేకింగ్ స్ట్రైక్‌రేట్ కూడా షమి పేరిటే నమోదైంది. ఐసీసీ వన్డే ఈవెంట్లలో షమి పేరిట అయిదు అయిదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయంటే అతడి స్థిరత్వాన్ని ఊహించొచ్చు. మెక్‌గ్రాత్, షేన్‌వార్న్, ముత్తయ్య మురళీధరన్ లాంటి దిగ్గజాల కంటే ఉత్తమైన స్ట్రైక్‌రేట్ షమిదే కావడం విశేషం.

### బుమ్రాకు బదులు..

జస్ప్రీత్ బుమ్రా గత కొంతకాలంగా భారత బౌలింగ్‌కు చుక్కానిగా ఉన్నాడు. ఎన్నో మ్యాచ్‌ల్లో ఒంటి చేత్తో టీమ్‌ఇండియాను గెలిపించాడు. కానీ బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో అయిన గాయం అతడిని మైదానానికి దూరం చేసింది. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో సిరీస్ ఆడలేకపోవడంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి కూడా తప్పుకొన్నాడు. దీంతో పునరాగమనం చేసిన షమిపై పెద్ద భారం పడింది. ఒకవైపు సత్తా చాటాలి.. ఇంకోవైపు యువ బౌలర్లతో కూడిన పేస్ దళాన్ని నడిపించాలనే బాధ్యతతో ఈ బెంగాల్ బౌలర్ బరిలో దిగాడు. తొలి మ్యాచ్‌లోనే అతడు తన బాధ్యతను గొప్పగా నిర్వర్తించాడు. ఒకవైపు అదిరే బౌలింగ్‌తో ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను కకావికలం చేయడమే కాక.. యువ పేసర్ హర్షిత్ రాణాకు స్ఫూర్తినిచ్చి అతడూ చెలరేగేలా చేశాడు. దీంతో బుమ్రా లేని లోటు అభిమానులకు తెలియలేదు. అయితే షమి పని ఇక్కడితో అయిపోలేదు. ముందుంది అసలు సవాల్! ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అతడు ఇదే జోరును ప్రదర్శించాల్సి ఉంది. టోర్నీ ఆసాంతం బౌలింగ్ దళాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. మరి ఈ పరీక్షలో అతడు ఎంతవరకు సఫలం అవుతాడో చూడాలి.

# అందుకే.. స్పిన్ ఆడటంలో
# కోహ్లీ ఇబ్బంది : హర్భజన్



విరాట్ కోహ్లీ మరోసారి స్పిన్నర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదిల్ రషీద్ బౌలింగ్‌లో ఇబ్బంది పడిన కోహ్లీ.. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలర్ రిషద్‌కు దొరికిపోయాడు. ఆదివారం పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా కీలక పోరులో తలపడనుంది. అందులోనూ అబ్రార్‌తో కోహ్లీకి ముప్పు తప్పదని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో విరాట్ ఎందుకు ఇబ్బందిపడుతున్నాడో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ విశ్లేషించాడు. "స్లో బంతులు, లెగ్గీలు ఆడటం విరాట్ కాస్త అసౌకర్యంగా భావిస్తున్నాడు. లెగ్‌సైడ్ వచ్చే బంతులను ఆడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ వెళ్తే ఒత్తిడి తగ్గుతుంది. ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు ఎక్కువగా సింగిల్స్‌పైనే దృష్టిపెట్టాలి. క్రీజ్‌లో కుదురుకునేందుకు సమయం తీసుకోవాలి. కానీ, విరాట్ విషయంలో ఇప్పటి వరకు అలా జరగలేదు. మనం ఎంత గొప్ప ప్లేయరైనా సరే.. మ్యాచ్‌కు వచ్చేసరికి ప్రదర్శనే కీలకం. వారసత్వం కలిసి రాదు. ఆడాలనే సంకల్పంతో ఉంటే ముందుకు సాగిపోవచ్చు. పరుగులు రాబట్టాలని గట్టిగా అనుకోవాలి. అలాగని సింగిల్స్ కూడా తీయకుండా క్రీజ్‌లో ఉండటం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు భారీ షాట్లకు వెళ్లాలనిపిస్తుంది. ఇక్కడ కోహ్లీ.. ఎవరికీ తానేంటో చూపించాల్సిన అవసరం లేదు. తన సత్తా ఏంటో అతడు నమ్మితే చాలు. ఆటను ఆస్వాదిస్తూ వెళ్తే పరుగులు వాటంతటవే వస్తాయి" అని హర్భజన్ వెల్లడించాడు.

### ఆ లోపాన్ని సరి చేసుకుంటే చాలు : రాబిన్ ఉతప్ప

"విరాట్ కోహ్లీ గొప్ప బ్యాటర్. ఈ విషయాన్ని అతడు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. నా అభిప్రాయం ప్రకారం అతడు కాస్త డైలమాలో ఉన్నాడు. ఎప్పుడైతే బంతిని బాగా మిడిల్ చేస్తాడో పరుగుల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ చేసే క్రమంలో స్వేచ్ఛగా ముందుకు సాగితే పరుగులు అవే వస్తాయి. కోహ్లీ సెకండ్ అండ్ థర్డ్ స్లిప్స్ మధ్య ఎక్కువగా పరుగులు రాబడతాడు. కానీ.. ఈ ఇన్నింగ్స్‌లో ఎక్కువగా కీపర్, ఫస్ట్ స్లిప్ మధ్య రన్స్ వచ్చాయి. ప్రతిసారీ ఆఫ్‌సైడ్ కవర్ డ్రైవ్ ఆడాలని ప్రయత్నించాడు. తనకు ఎంతో ఇష్టమైన షాట్ అయినప్పటికీ ఇది చాలా ప్రమాదకరం. ఈ విషయమై అతడితో ఎవరైనా చర్చిస్తారని అనుకుంటున్నా. ఈ లోపాన్ని సరిచేసుకోగలిగితే కోహ్లీ తిరిగి లయను అందుకుంటాడు" అని రాబిన్ ఉతప్ప తెలిపాడు.

# ఆ జట్టేమైనా పాకిస్థానా? ఆసీసా?..
### 35 ఓవర్లలోనే ముగిస్తారనుకున్నా: సెహ్వాగ్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. 229 పరుగుల లక్ష్య ఛేదనను 46.3 ఓవర్లలో పూర్తి చేసి గెలిచింది. ఒకదశలో 144/4 స్కోరుతో భారత్ ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. కానీ, శతక వీరుడు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ కలిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ సమయంలో ఏమైనా కంగారు పడ్డారా? అనే ప్రశ్నకు భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. టీమ్‌ఇండియా ఇంకాస్త ముందుగానే టార్గెట్‌ను ఛేదిస్తుందని భావించానని.. బంగ్లాపై ఏమాత్రం కంగారు పడలేదని వ్యాఖ్యానించాడు. అలా జరగడానికి అదేమైనా పాకిస్థాన్ జట్టా లేదా ఆస్ట్రేలియానా అని పేర్కొన్నాడు. "భారత్ – బంగ్లాదేశ్ మ్యాచ్‌లో నేను ఏదశలోనూ టెన్షన్ పడలేదు. ఎందుకంటే అక్కడ ఉంది బంగ్లా. మీరు ఆ జట్టును నాతో పొగిడించు కోవాలనుకుంటున్నారా? అలా జరగాలంటే అది అద్భుతమైన టీమ్‌గా మారాలి. నేను క్రికెట్ ఆడినప్పుడే బంగ్లాను చూసి ఎప్పుడూ భయపడలేదు. అలాంటిది ఇప్పుడు అసలు కంగారే లేదు. అసాధారణ ప్రదర్శన చేయడానికి అదేమైనా పాకిస్థానా..? ఆస్ట్రేలియానా? మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లను కోల్పోయినా సరే ఇబ్బందే పడలేదు. అయితే, చాలా తేలికగా విజయం సాధించాల్సిన మ్యాచ్. నాలుగు ఓవర్లు మాత్రమే మిగిలి ఉండగా.. భారత్ గెలిచింది. రోహిత్, విరాట్, శ్రేయస్‌లో ఒకరు క్రీజ్‌లో ఉండుంటే భారత్ 35 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేది" అని సెహ్వాగ్ తెలిపాడు.

### కోహ్లీ ఛేజ్ మాస్టర్...

"ప్రతి ఒక్కరి ఫేవరెట్, నాకు రోల్ మోడల్ సచిన్ తెందూల్కర్. అతడితో కలిసి మైదానంలో నడుస్తుంటే ఆ భావనే అద్భుతంగా ఉంటుంది. అడవిలోకి సింహంతో వెళ్తున్నట్లే ఉంటుంది. ప్రతి ఒక్కరి చూపు అతడిపైనే. అప్పుడు నేను నిశ్శబ్దంగా పరుగులు చేసేవాడిని. అయితే, ఛేజింగ్‌లో మాత్రం సచిన్, విరాట్‌లో ఎవరు అంటే మాత్రం నేను విరాట్‌వైపే మొగ్గు చూపిస్తా. 2011–12 నుంచి ఇప్పటి వరకు కోహ్లీ చాలా మారిపోయాడు. అతడి ఫిట్‌నెస్, నిలకడ అద్భుతం. భారత్ కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు" అని సెహ్వాగ్ తెలిపాడు.



# అసలు మా జట్టుకు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే అర్హతే లేదు : కమ్రాన్ అక్మల్
### జింబాబ్వే-ఐర్లాండ్‌తో సిరీసులు ఆడుకోండి
### అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలి

స్వదేశంలో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్ ఘోర పరాభవంతో ప్రారంభించింది. న్యూజిలాండ్ తో జరిగిన మొదటి మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో ఆ జట్టుపై మాజీ క్రికెటర్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. పాక్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ మరో అడుగు ముందుకేసి.. జింబాబ్వే–ఐర్లాండ్‌తో సిరీసుల్లో ఆడుకోవాలని వ్యాఖ్యానించాడు. అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలని కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్‌కు అక్మల్ చురకలంటించాడు. "ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ జట్టు వైదొలగాలి. జింబాబ్వే, ఐర్లాండ్‌ల మధ్య జరుగుతోన్న సిరీస్‌లో పాల్గొనాలి. అందులో విజయం సాధిస్తేనే మా టీంకు ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే అర్హత ఉన్నట్లు. ఇలా అనడానికి కారణం ఉంది. మా జట్టు ఆటతీరు ఇలానే ఉంది. గత ఆరేడేళ్ల నుంచి మా జట్టు క్రికెట్ ప్రమాణాలు అతి ఘోరంగా పడిపోయాయి' అని వ్యాఖ్యానించాడు.

### కివీస్‌ను చూసి నేర్చుకోండి

"పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కివీస్ నిలకడైన ఆటతీరును ప్రదర్శించింది. మూడు వికెట్లు కోల్పోయినా స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ ఆ జట్టు బ్యాటర్లు పరుగులు రాబట్టారు. తొలుత నెమ్మదిగా ఆడి.. మ్యాచ్ తమ నియంత్రణలోకి వచ్చిందని భావించాక దూకుడు పెంచారు. పరిణితి చెందిన జట్టు చేసే పని అదే. కనీసం కివీస్‌ను చూసైనా పాక్ నేర్చుకోవాలి. విల్ యంగ్, టామ్ లేథమ్ నిలకడగా ఆడి సెంచరీ సాధించారు" అని కమ్రాన్ అక్మల్ తెలిపాడు. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ పాకిస్థాన్ ముందు 320 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత ఛేజింగ్‌లో పాక్ విఫలమైంది. కివీస్ బౌలర్ల దెబ్బకు పాక్ జట్టు కేవలం 260 పరుగులకే పరిమితమైంది.



# సీనియర్ల విషయంలో గంభీర్ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
### అనిల్ కుంబ్లే

భారత జట్టు భవిష్యత్తు కోసం మార్పులు చేసే క్రమంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే సూచించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత ప్రధాన కోచ్ గంభీర్ ఎదుట కఠిన సవాళ్లు ఎదురవుతాయని వ్యాఖ్యానించాడు. సీనియర్లు రోహిత్, విరాట్, రవీంద్ర జడేజా, షమీ విషయంలో కఠిన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని.. అంతా సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత మాత్రం గంభీర్‌పైనే ఉందన్నాడు. "భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఇది చాలా కీలకమైన టోర్నీ. ఎందుకంటే దీని తర్వాత చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. స్టార్ ప్లేయర్ల వారసత్వాన్ని కొనసాగించాలి. అయితే, ఇది కోచ్‌గా ఆయన బాధ్యత. అందుకే, ఈ టోర్నమెంట్‌తో సీనియర్ల భవిష్యత్తు కూడా తేలిపోనుంది. ఏ స్థానాల్లో మార్పులు చేయాలనేది తెలుస్తుంది. గెలిచినా.. ఓడినా మార్పులు మాత్రం ఖాయం. ఇది ముగిసిన తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 మెగా టోర్నీకి సన్నాహాలు ప్రారంభించాలి. అలా చేయాలంటే యువకులతో కూడిన స్క్వాడ్‌ను సిద్ధం చేసుకోవాలి. అందులోని ప్రతిఒక్కరికీ కనీసం 20 మ్యాచుల్లో ఆడే అవకాశం కల్పించాలి. అప్పుడే పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడేందుకు ఆస్కారముంటుంది.

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత సీనియర్లను కొనసాగించాలా? యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలా అనేది కోచ్, మేనేజ్‌మెంట్ నిర్ణయించాలి. ఈ విషయంలో గంభీర్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. టీ20ల్లో ఇప్పటికైతే సన్నద్ధత బాగుంది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో జట్టు మెరుగైన ప్రదర్శన చేస్తోంది. వచ్చే ఏడాది పొట్టి కప్ జరగనుంది. వన్డే ప్రపంచకప్‌నకు రెండేళ్ల సమయం ఉంది. ఆలోగా యువ క్రికెటర్లను సిద్ధం చేయొచ్చు. నిలకడగా పరుగులు చేసే క్రికెటర్లకు అవకాశాలు ఇవ్వాలి" అని కుంబ్లే వెల్లడించాడు. రోహిత్, విరాట్ ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్‌కూ గుడ్‌బై చెబుతారని క్రికెట్ వర్గాల అంచనా.

# సౌతాఫ్రికా చేతిలో ఆఫ్ఘనిస్తాన్ చిత్తు




ఛాంపియన్స్ ట్రోఫీలో సౌతాఫ్రికా తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్ బి లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్ లో ఆఫ్ఘనిస్తాన్ పై సఫారీలు 107 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(103: 106 బంతుల్లో.. 7 ఫోర్లు, సిక్సర్) సెంచరీతో పాటు కెప్టెన్ బవుమా(58), రాస్సీ వాన్ డెర్ డస్సెన్(52),ఐడెన్ మార్క్రామ్(52) హాఫ్ సెంచరీలతో రాణించారు. లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ 43.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయింది. రహ్మత్ షా(90) చివరి వరకు పోరాడినా అతనికి సహకరించేవారు కరువయ్యారు. 316 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ ఏ దశలోనూ లక్ష్యాన్ని అందుకునేలా కనిపించలేదు. ఆ జట్టు వరుస విరామాల్లో వికెట్లను కోల్పోతూ వస్తుంది. దీంతో 50 పరుగులకే నాలుగు వికెట్లను కోల్పోయి మ్యాచ్ పై ఆశలు వదిలేసుకుంది. ఈ దశలో రహ్మత్ షా ఒక్కడే వారియర్ లా పోరాడాడు. సహచర ప్లేయర్లు విఫలమైనా సెంచరీతో జట్టు పరువును కాపాడాడు. 90 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచి సెంచరీ మిస్ చేసుకున్నాడు. మిగిలిన వారిలో ఏ ఒక్కరు కూడా కనీసం 20 పరుగులు చేయలేకపోయారు. సౌతాఫ్రికా బౌలర్లలో రబడా మూడు వికెట్లు పడగొట్టాడు. ఎంగిడి, మల్డర్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(103: 106 బంతుల్లో.. 7 ఫోర్లు, సిక్సర్) సెంచరీతో పాటు కెప్టెన్ బవుమా (58), రాస్సీ వాన్ డెర్ డస్సెన్(52),ఐడెన్ మార్క్రామ్(52) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆరంభంలోనే ఆ జట్టు వికెట్ కోల్పోయింది. టోనీ డి జోర్జీ 11 పరుగులు చేసి నబీ బౌలింగ్ లో ఔటయ్యాడు. ఈ దశలో కెప్టెన్ ఓపెనర్ రికెల్టన్, బవుమా ఇన్నింగ్స్ ను ముందు తీసుకెళ్లారు. ఆఫ్గన్ బౌలర్లను ఈజీగా ఆడిస్తూ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రెండో వికెట్ కు ఏకంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీ స్కోర్ కు బాటలు వేశారు. ఈ క్రమంలో వీరిద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. హాఫ్ సెంచరీ తర్వాత బవుమా(58) ఔటైనా.. వాన్ డెర్ డస్సెన్ సహకారంతో రికెల్టన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మిల్లర్ విఫలమైనా డస్సెన్, మార్క్రం హాఫ్ సెంచరీలతో సౌతాఫ్రికా స్కోర్ బోర్డును 300 పరుగులు దాటించారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో మహమ్మద్ నబీ రెండు వికెట్లు పడగొట్టాడు. ఫరూఖీ, ఒమర్జాయ్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

# ఆ ఇద్దరినీ కాదని.. బెస్ట్ ఫీల్డర్‌గా కేఎల్ రాహుల్



ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్‌ఇండియా విజయంతో మొదలుపెట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాపై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. గత వన్డే ప్రపంచకప్ సమయంలో బెస్ట్ ఫీల్డర్ మెడల్‌ను అందజేస్తూ ఓ ఆనవాయితీని బీసీసీఐ మేనేజ్‌మెంట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ నాణ్యమైన ఫీల్డింగ్ నైపుణ్యం ప్రదర్శించిన క్రికెటర్‌కు కోచ్ దిలీప్ మెడల్‌ను ప్రకటించారు. ఈసారి రేసులో ముగ్గురు నిలవగా.. అందులో ఒకరికి ఈ మెడల్ దక్కింది. ఆ వివరాలతో కూడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "వెల్‌డన్ బాయ్స్.. తొలి మ్యాచ్‌లో అద్భుతమైన ఫీల్డింగ్ చేశారు. డోమ్ లైట్ల వెలుతురులో క్యాచ్‌లను అందుకోవడం చాలా కష్టమే. అయితే, ప్రతి మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుంటున్నాం. తర్వాత మ్యాచ్‌లో మరింత బలంగా మైదానంలోకి దిగుదాం. ఇక ఈ మ్యాచ్‌లో అందరూ చురుగ్గానే కదిలారు. అయితే, అతడి వద్దకు ఎప్పుడు బంతి వచ్చినా ఒడిసిపట్టుకొనే క్రికెటర్ విరాట్ కోహ్లీ. అలాగే వికెట్ల వెనక కీపింగ్ చేయడం ఎప్పుడూ సవాలే. కొత్త బంతిని అంచనా వేయడం చాలా కష్టం. లెగ్‌సైడ్ డైవింగ్ చేస్తూ అద్భుత ఫీల్డింగ్ చేసిన కేఎల్ రాహుల్‌కు నా అభినందనలు. శుభ్‌మన్ గిల్ కూడా బెస్ట్ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ ముగ్గురిలో ఈసారి కేఎల్ రాహుల్‌కు బెస్ట్ ఫీల్డర్ మెడల్ ఇస్తున్నాం" అని దిలీప్ వెల్లడించాడు.

# 'బాపు'.. మూవీ ఎలా ఉంది?

రివ్యూ

'బలగం' ఛాయలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన చిత్రం 'బాపు'. బ్రహ్మాజీ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో 'బలగం' సుధాకర్‌రెడ్డి టైటిల్ పాత్రలో నటించారు. మరి ఈ బాపు కథేంటి?అతని ప్రయాణం ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతులు అందించింది?




**కథేంటంటే:** తెలంగాణలోని ఓ మారుమూల గ్రామంలో జరిగే కథ ఇది. మల్లన్న (బ్రహ్మాజీ) ఓ బీదరైతు. అప్పు చేసి, తనకున్న ఎకరం భూమిలో పత్తి పండిస్తాడు. అయితే, మల్లన్న కొడుకు రాజు (మణి ఎగుర్ల) నిర్లక్ష్యం వల్ల ఆ పంటంతా వర్షార్పణం అయిపోతుంది. దీంతో అప్పిచ్చిన వాళ్లంతా ఒక్కసారిగా మల్లన్న ఇంటిపై పడతారు. నెలరోజుల్లోగా అప్పు తిరిగి చెల్లించకపోతే పొలాన్ని వేలం వేయిస్తామని హెచ్చరిస్తారు. దీంతో చేసేదేమీ లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు మల్లన్న. అలా చేస్తే ప్రభుత్వం నుంచి రూ.5లక్షల రైతు బీమాతో కొంతైనా అప్పు తీరుతుందనుకుంటాడు. అతని నిర్ణయానికి భార్య సరోజ (ఆమని) అడ్డు చెబుతుంది. కావాలంటే ఆ రైతు బీమా డబ్బు కోసం ఇంటి పెద్ద, మల్లన్న తండ్రైన రాజయ్య (బలగం సుధాకర్‌రెడ్డి)ను చంపేద్దామని సలహా ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏం జరిగింది? మల్లన్న తన భార్య, పిల్లలతో కలిసి తండ్రిని చంపడానికి ఎలాంటి ప్రణాళికలు రచించారు? అవన్నీ ఫలించాయా లేదా?అన్నది కథ.

**ఎవరెలా చేశారంటే:** రైతన్నల ఆత్మహత్యల అంశంతో ముడిపడి ఉన్న కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల స్ఫూర్తితో దర్శకుడు దీన్ని సిద్ధం చేసుకున్నారు. అలాగని ఇదేమీ పూర్తిగా సీరియస్‌గా సాగే కథైతే కాదు. డార్క్ హ్యూమర్‌తో భావోద్వేగభరితంగా చెప్పే ప్రయత్నం చేశారు. రైతుల కష్టాన్ని ఓవైపు చూపిస్తూనే.. మరోవైపు డబ్బు అవసరం మనిషితో ఎలాంటి తప్పులు చేయిస్తుంది? బంధాల్ని ఎలా బలి పెట్టేలా చేస్తుందన్నది? కళ్లకు కట్టింది. ఈ చిత్రం ప్రధానంగా మల్లన్న తండ్రి చుట్టూనే తిరుగుతుంది. అతని కుటుంబంలోని ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ నిదానంగా కథను ముందుకు తీసుకెళ్లాడు దర్శకుడు. అప్పు తీర్చడానికి మామ రాజయ్యను చంపుదామని మల్లన్న భార్య సలహా ఇవ్వడం కథను మలుపు తిప్పుతుంది. మల్లన్న తన సమస్యను తండ్రికి చెప్పి.. ఆత్మహత్య చేసుకోమని ఒప్పించడం.. ఈ క్రమంలో అతన్ని బలిచ్చే మేకలా పోషించడం ప్రేక్షకులు ఓ పట్టాన జీర్ణించుకోలేకపోవచ్చు. భార్య చెప్పిన మాట విని అంత తేలికగా తండ్రిని చంపుకొనేందుకు మల్లన్న ఎందుకు సిద్ధపడ్డాడో ఏమాత్రం అర్థం కాదు. మరోవైపు ఆత్మహత్య చేసుకుంటానని చెప్పిన రాజయ్య ఆ సంగతి మర్చిపోవడం.. ఈ విషయం తెలియక అతని చావు కోసం ఎదురు చూస్తూ మల్లన్న, అతని భార్య పడే తిప్పలు అక్కడక్కడా నవ్వులు పూయిస్తాయి. సరిగ్గా విరామానికి మల్లన్న కుటుంబమంతా కలిసి ఆ ముసలాయన్ని చంపేందుకు సిద్ధమవ్వడంతో తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంటుంది.

ఇక అక్కడి నుంచి రాజయ్యను చంపేందుకు మల్లన్న కుటుంబం ఎలాంటి ప్రణాళికలు వేసింది.. వాటి నుంచి ఆ ముసలాయన ఎలా తప్పించుకున్నాడనే కోణంలోనే ద్వితీయార్ధమంతా సాగుతుంది. ఆ ఎపిసోడ్స్ ప్రేక్షకుల్ని బాగానే నవ్విస్తాయి. ఇక ఈ మధ్యలో మల్లన్న పిల్లల ప్రేమకథలు కథాగమనానికి స్పీడ్ బ్రేకర్లలా అడ్డుతగులుతుంటాయి. కథ ఆరంభం నుంచి సాగుతున్న బంగారు విగ్రహం ఎపిసోడ్ ఆఖరికి ఏమవుతుందన్నది ప్రేక్షకులు ముందే ఊహించేయొచ్చు. క్లైమాక్స్‌ను దర్శకుడు చాలా సింపుల్‌గా తీర్చిదిద్దుకున్నాడు. కానీ, ఆ ముగింపు అందర్నీ సంతృప్తి పరచకపోవచ్చు.

**ఎవరెలా చేశారంటే:** బ్రహ్మాజీ పేద రైతుగా ఒదిగిపోయాడు. భావోద్వేగ సన్నివేశాల్లో ఆయన నటన ఆకట్టుకుంటుంది. సరోజగా ఆమని పాత్ర అందర్నీ అలరిస్తుంది. రాజయ్య పాత్రలో బలగం సుధాకర్‌రెడ్డి అమాయకత్వం, సహజమైన నటన ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది. మణి, ధన్య, శ్రీనివాస్ అవసరాల, రచ్చ రవి, గంగవ్వ తదితరుల పాత్రలు కథకు తగ్గట్లు పరిధి మేరకు ఉంటాయి. దర్శకుడు దయ ఈ కథలోని పాత్రల్ని చాలా సహజంగా తెరపై చూపించాడు. ఎంచుకున్న కథలో కొత్తదనముంది. రైతుల కష్టాల్ని.. వాళ్ల ఆత్మహత్యలకు గల కారణాల్ని వాస్తవంగా దగ్గరగా చూపించే ప్రయత్నం చేశారు. తెలంగాణ వాతావరణాన్ని ఎంతో సహజంగా చూపించారు. ధ్రువన్ సంగీతం, పాటలు కథలో భాగమయ్యాయి. నిర్మాణ విలువలు కథకు తగ్గట్లుగా కుదిరాయి.



## హరిహర వీరమల్లు నుంచి కొల్లగొట్టినాదిరో.. పాట

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' నుండి సెకండ్ సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' ఫిబ్రవరి 24న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ తో పాటు కథానాయిక నిధి అగర్వాల్ పై ఈ పాటను నైట్ ఎఫెక్ట్స్ లో చిత్రీకరించారు. విశేషం ఏమంటే... ఇందులో అనసూయ భరద్వాజ్‌తో పాటు పూజిత పొన్నాడ కూడా స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చింది. 'కోర కోర మీసాలతో, కొదమ కొదమ అడుగులతో... కొంటెకొంటె చణుకులతో, కొలిమి లాంటి మగటిమితో... సరసర వచ్చినాడు చిచ్చర పిడుగంటి వాడు' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాశారు. దీనిని ఎం.ఎం. కీరవాణి స్వరపర్చగా, దీనిని మంగ్లీ , రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల గానం చేశారు.ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది విడుదల కాబోతోంది. తొలి భాగాన్ని మార్చి 28న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. అయితే బాలెన్స్ ఉన్న చిత్రీకరణ ను పూర్తి చేసే బాధ్యతను ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ భుజానికి కెత్తుకున్నాడు. పవన్ కళ్యాణ్ పాల్గొనగా నాలుగు రోజుల ఎ÷-లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఒక్కటి ఇంకా చిత్రీకరించాల్సి ఉందని, అది మినహా మిగిలిన భాగానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తం జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు పోషించారు.



## 'నో కిస్.. నో ఇంటిమేట్ సీన్స్' పాలసీ పెట్టుకోవడానికి కారణమదే : నటుడు

'మార్కో'తో ఇటీవల విజయాన్ని అందుకున్నారు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్. పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రాల్లో నటించడమే తనకు ఇష్టమని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తన సినిమాలను అన్ని వయసుల వారు వీక్షించాలనేది ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ కారణంతోనే దర్శక నిర్మాతలు ఎంత ఒత్తిడి తెచ్చినా.. తాను కొన్నింటిని ఎప్పటికీ అంగీకరించనని స్పష్టం చేశారు. "సినిమాల్లోకి అడుగుపెట్టిన సమయంలోనే.. ముద్దు, ఇంటిమేట్ సీన్స్‌కు దూరంగా ఉండాలనే పాలసీ పెట్టుకున్నా. ఇప్పటివరకూ నటించిన అన్ని సినిమాల్లోనూ దానిని పాటించా. ప్రేక్షకులందరూ కలిసి కూర్చొని చూసేలా నా సినిమాలు ఉండాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. అలాంటి సీన్లలో నటించాలని ఎంతోమంది దర్శక నిర్మాతలు నాపై ఒత్తిడి తీసుకువచ్చారు. వేరే హీరోల సినిమాలను ఉదాహరణగా చూపిస్తూ మీరూ చేయొచ్చుగా అని అడుగుతుంటారు. ఒక జంట మధ్య రొమాన్స్ చూపించాలనుకుంటే.. ముద్దులు పెట్టుకోవడం ఒక్కటే మార్గం కాదనేది నా భావన. నాతోటి హీరోలు అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని నేను ఏమాత్రం తప్పుపట్టను. నేను అలాంటి వాటిల్లో నటించను. ఇది నాకు నేనుగా పెట్టుకున్నా పాలసీ" అని ఉన్ని ముకుందన్ చెప్పారు. మలయాళంలో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఉన్ని ముకుందన్ 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడి', 'యశోద' వంటి తెలుగు సినిమాల్లోనూ యాక్ట్ చేశారు. ఆయన నటించిన 'మార్కో' బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఓటీటీలోనూ అందుబాటులో ఉంది. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'గెట్ సెట్ బేబీ' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



## ఆ సీన్‌లో మోహన్‌లాల్ యాక్టింగ్ నచ్చలేదు.. : రామ్‌గోపాల్ వర్మ

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటనపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ప్రశంసలు కురిపించారు. ఆయన సహజ నటుడని పేర్కొన్నారు. తమ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కంపెనీ' రోజులను గుర్తు చేసుకున్నారు. కంపెనీ స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ చూసి షాకయ్యానని తెలిపారు. "'కంపెనీ' కథ చెప్పడం కోసం తొలిసారి మోహన్‌లాల్‌ను కలిశా. కథ, తన పాత్రను ఉద్దేశించి చాలా సందేహాలు అడుగుతారని.. ఆ మేరకు సన్నద్ధమయ్యా. ఆయన ఏం అడిగినా సమాధానం చెప్పాలనుకున్నా. తీరా కథ చెప్పడం పూర్తి కాగానే ఆయన.. ఎన్ని రోజులు షూట్ చేస్తారని మాత్రమే అడిగారు. ఇలాంటి క్లైమాక్స్ నేను అస్సలు ఊహించలేదు. నాకు తెలిసి దర్శకులందరితో ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తుంటారు. ఎందుకంటే ఆయనకు సినిమా గురించి ఎంతో అవగాహన ఉంది. అలాగే, దర్శకులపై ఆయన నమ్మకం ఉంచుతారు" "'కంపెనీ' షూట్ సమయంలో యాక్టింగ్ పరంగా కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఓ సీన్‌లో ఆయన ప్రదర్శన నాకు ఏమాత్రం నచ్చలేదు. సీన్‌కు అనుగుణంగా ఆయన నటించడం లేదనిపించింది. అదే సన్నివేశాన్ని సుమారు ఏడెనిమిది టేకులు చేశాం. తర్వాత వాటన్నింటినీ పరిశీలిస్తే ఆయన తొలి టేక్‌లోనే బాగా చేశారనిపించింది. నిజం చెప్పాలంటే ఆయన సహజ నటుడు. సీన్ వివరిస్తే చాలు దర్శకుడికి కావాల్సిన విధంగా నటిస్తారు" అని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. 2002లో 'కంపెనీ' మూవీ విడుదలైంది.



## మణిరత్నం సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నవీన్ పోలిశెట్టి



టాలీవుడ్ యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఆయన దిగ్గజ దర్శకుడు మణిరత్నంతో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నాలు, మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్. సినిమా సినిమాకు గ్యాప్ తీసుకునే నవీన్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చేయికి గాయం అయ్యింది. దీంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అయితే నవీన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం అనగనగా ఒకరాజు. మీనాక్షి చౌదరీ ఈ సినిమాలో కథనాయికగా నటిస్తుంది. ఈ సినిమా అనంతరం నవీన్ మణిరత్నం సినిమాలో చేయబోతున్నట్లు తెలుస్తుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి త్వరలోనే అన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మణిరత్నం విషయానికి వస్తే.. ప్రస్తుతం థగ్ లైఫ్ అనే సినిమను తెరకెక్కిస్తున్నాడు. కమల్ హాసన్, శింబు ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ చిత్రం ఈ సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




## ఓటిటిలోకి వస్తోన్న ఎమర్జెన్సీ

కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమ్జ్గ÷న్సీ'. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చి చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. త్వరలో ఇది ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని కంగన తాజాగా ప్రకటించారు. నెట్‌ప్లిక్స్ వేదికగా మార్చి 17 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రూ.60 కోట్లతో దీనిని రూపొందించగా.. రూ.21 కోట్లు మాత్రమే ఈ సినిమా రాబట్టినట్లు అంచనా.

## చిరంజీవి మాట.. నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది : సందీప్ కిషన్



'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు సందీప్ కిషన్. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. "ఎవరి సపోర్ట్ లేకుండా నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా" అని సందీప్ కిషన్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. "ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా" అని చెప్పారు.

## ధనుష్ మేకింగ్ స్టైల్‌పై కీర్తిసురేశ్ ప్రశంసలు

హీరో ధనుష్ మేనల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్'. ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. "ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండిపోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com